

ఎట్టకేలకు!

రాజకీయాల్లోకి నటుడు విజయ్

● 'తమిళగ వెట్రి కళగం' పేరుతో పార్టీ ప్రారంభం

● లోక్‌సభ ఎన్నికలకు దూరం ● అసెంబ్లీ ఎన్నికలే లక్ష్యం

చెన్నై, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ తమిళ సినీనటుడు విజయ్ ఎట్టకేలకు రాజకీయ ప్రవేశం చేశారు. 'తమిళగ వెట్రి కళగం' పేరుతో కొత్త పార్టీని ప్రారంభించారు. ఆ మేరకు కేంద్ర ఎన్నికల సంఘంలో పార్టీ పేరు నమోదు కార్యక్రమాన్ని చేపడుతున్నట్లు ప్రకటించారు. అదే సమయంలో లోక్‌సభ ఎన్నికల్లో పోటీ చేయబోమని, ఏ కూటమికి మద్దతు ఇచ్చే ప్రసక్తి లేదని స్పష్టం చేశారు. అయితే వచ్చే శాసన సభ ఎన్నికల్లో తమ పార్టీ తప్పకుండా పోటీ చేసి అధికారంలోకి వస్తుందని ఆయన ధీమా వ్యక్తం చేశారు. ఈ మేరకు శుక్రవారం ఉదయం ఆయన ఓ సుదీర్ఘ ప్రకటన జారీ చేశారు.

స్వచ్ఛంద సంస్థను...

విజయ్ తన సినీ అభిమానులతో సామాజిక సేవా కార్యకలాపాలను నిర్వహిస్తూ తనకంటూ 'విజయ్ మక్కల్ ఇయక్కమ్' పేరుతో స్వచ్ఛంద సంస్థను కూడా ఏర్పాటు చేసుకున్నారు. ఆ సంస్థను రాజకీయ పార్టీగా మార్చనున్నారంటూ కొన్నేళ్లుగా ప్రచారం జరుగుతూనే ఉంది. ఈ పరిస్థితుల్లో విజయ్ రాజకీయ పార్టీని ప్రారంభించారు. విజయ్ మక్కల్ ఇయక్కమ్ కొన్నేళ్లుగా సామాజిక సేవా కార్యక్రమాలను ముమ్మరంగా చేపడుతోందని, అయితే సామాజిక, ఆర్థికపరమైన రాజకీయ సంస్కరణలు తీసుకువచ్చేందుకు స్వచ్ఛంద సంస్థకు సాధ్యపడదని, అందువల్ల రాజకీయ అధికారం అవసరమవుతోందని ప్రకటనలో పేర్కొన్నారు. ప్రస్తుత రాజకీయ పరిస్థితులు రాష్ట్ర ప్రజలందరికీ తెలిసిన విషయమేనని, ఓ వైపు అవినీతి అక్రమాలతో కూడిన రాజకీయాలు, మరో వైపు కులం, జాతుల పేరుతో ప్రజల మధ్య చిచ్చు రగులుస్తున్న నీచ రాజకీయాలు ప్రజల సమైక్యతకు అభివృద్ధి అడ్డుకట్టలుగా ఉన్నాయని విమర్శించారు. పారదర్శకమైన జాతి, మత భేదాలకు తావులేని అవినీతి రహిత సమాజ స్థాపనకు కోసం రాజకీయ మార్పు కోసం ప్రజలంతా ఎదురుచూస్తున్నారని తెలిపారు. రాజ్యాంగ ధర్మాసన పరిమితులకు లోబడి ఆ రాజకీయ మార్పు జరగాలని, రాష్ట్ర ప్రజల హక్కులను పరిరక్షించే విధంగా ఉండాలని తెలిపారు. అన్ని ప్రాణులకు అన్ని సదుపాయాలు, అందరూ సమానులు అనే భావన కలిగిన రాజకీయ మార్పు అవసరమని తెలిపారు. ఈ పరిస్థితులలో తన తల్లిదండ్రుల తర్వాత తనకు పేరు ప్రఖ్యాతులు కలిగించిన తమిళ ప్రజలకు తమిళ సమాజానికి సంపూర్ణంగా సాయపడాలన్నదే తన సంకల్పమని, తిరువళ్లువర్ నుడివినట్లు లక్ష్యం కోసం సాహసం చేయడమే ధర్మమని భావిస్తున్నానని తెలిపారు.

అభిమానుల్లో ఉత్సాహం...

తమ దళపతి విజయ్ రాజకీయ పార్టీ ప్రారంభించినట్లు ప్రకటన జారీ చేయగానే రాష్ట్ర వ్యాప్తంగా ఆయన అభిమానులు టపాకాయలు పేల్చి, ప్రజలకు మిఠాయిలు పంచిపెట్టి సందడి చేశారు. విజయ్ నివాస ప్రాంతం ఉన్న నీలాంగరై, తిరువాన్మియూరు, పనయూరు ప్రాంతాల్లో విజయ్ మక్కల్ ఇయక్కం నేతలు, సభ్యులు రహదారులల్లో టపాకాయలు పేల్చారు. ఇదే విధంగా కోయంబత్తూరు, మదురై, తిరుచ్చి తదితర నగరాల్లో విజయ్ అభిమానులు అందరికీ మిఠాయిలు పంచిపెట్టారు.


నీలాంగరైలో కొత్త పార్టీ బ్యానర్‌ను ప్రదర్శిస్తున్న విజయ్ అభిమానులు

అసెంబ్లీ ఎన్నికలపైనే దృష్టి..

2026లో శాసనసభ ఎన్నికల్లో తమ పార్టీ పోటీ చేసి అధికారంలోకి వస్తుందని విజయ్ ఆశాభావం వ్యక్తం చేశారు. ఎన్నికల సంఘం అధికారిక గుర్తింపు, లోక్‌సభ ఎన్నికల ప్రక్రియ పూర్తయిన తర్వాత తమిళ ప్రజల లక్ష్యాలను సాధించేందుకు, వారి అభివృద్ధికి చేపట్టాల్సిన చర్యలు గురించి సమీక్షించి పార్టీ పతాకం, చిహ్నం కార్యాచరణ పథకాలు రూపొందించుకుని తన రాజకీయ యాత్రను ప్రారంభిస్తానన్నారు. అదే సమయంలో తన అభిమానులను, మక్కల్ ఇయక్కం సభ్యులకు పార్టీలో సభ్యత్వం కల్పించిన తర్వాత పార్టీ నియమ నిబంధనల మేరకు కొత్త కార్యవర్గాన్ని క్షేత్రస్థాయి నుంచే ఎంపిక చేస్తానని విజయ్ తెలిపారు. పార్టీని అసెంబ్లీ ఎన్నికలకు సిద్ధం చేయడానికి వచ్చే రెండేళ్లు సరిపోతుందనే భావనతోనే ప్రస్తుతం రాజకీయ ప్రవేశం చేసినట్లు పేర్కొన్నారు. రాజకీయం వ్యాపారం కాదని, అదో సేవ అని తాను భావిస్తానని, రాజకీయ లోతుపాతులను కొంతకాలంగా పరిశీలిస్తూ వచ్చానన్నారు. రాజకీయాలను తాను హాబీగా పరిగణించడం లేదని, ప్రస్తుతం తాను అంగీకరించిన సినిమాలకు సంబంధించిన బాధ్యతలను పార్టీ పనులకు ఆటంకం కలగని విధంగా నిర్వర్తిస్తానన్నారు. ఆ తర్వాత పూర్తిస్థాయిలో రాజకీయాలకే అంకితమవుతునానని విజయ్ శపథం చేశారు.



అన్నామలై శుభాకాంక్షలు...

రాజకీయ ప్రకటన చేసిన నటుడు విజయ్‌కి పలువురు రాజకీయ పార్టీల నాయకులు శుభాకాంక్షలు తెలిపారు. బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు అన్నామలై తన 'ఎక్స్' పేజీలో ఓ సందేశం వెలువరిస్తూ... రాష్ట్రంలో ప్రజలను దోచుకుంటున్న అవినీతి రాజకీయాలకు వ్యతిరేకంగా, సమసమాజ స్థాపన దిశంగా ప్రజలకు సేవలందించేందుకు తమిళగ వెట్రి కళగం పేరుతో పార్టీని ప్రారంభించిన సోదరుడు విజయ్‌కి హార్దిక శుభాకాంక్షలు తెలియజేస్తున్నానని పేర్కొన్నారు. ఇదే విధంగా మంత్రి ఉదయనిధి, నామ్ తమిళర్ కట్చి నేత సీమాన్ కూడా విజయ్‌కి శుభకాంక్షలు తెలిపారు.

ఆ మేరకే 'తమిళగ వెట్రి కళగం' అనే పేరుతో తన నాయకత్వంలో ఓ రాజకీయ పార్టీని ప్రారంభించి కేంద్ర ఎన్నికల సంఘంలో పేరు నమోదుకు శుక్రవారం దరఖాస్తు కూడా సమర్పించినట్లు వివరించారు. గత జనవరి 25న చెన్నైలో రాష్ట్ర సర్వసభ్యమండలి, కార్యాచరణ మండలి సమావేశాలు జరిపామని, ఆ సమావేశాల్లో పార్టీ నాయకుడు, కార్యదర్శులు తదితర పదవులకు ఎంపిక ప్రక్రియ కూడా పూర్తయిందన్నారు. ఆ సమావేశంలోని పార్టీ నియమనిబంధనలు కూడా రూపొందించి సర్వసభ్యులందరి ఆమోదంతో అంగీకరించామని తెలిపారు.

13న నగరానికి మల్లికార్జున ఖర్గే

సీట్ల సర్దుబాటుపై ముఖ్యమంత్రితో భేటీ ● భారీ బహిరంగ సభకు ఏర్పాట్లు

పెరంబూర్, ఫిబ్రవరి 2: ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే ఈ నెల 13న నగరానికి రానున్నారు. ఈ సందర్భంగా పార్టీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఎన్నికల ప్రచార సభలో ఆయన ప్రసంగించనున్నారు. ఈ సభలో కూటమి పార్టీల నేతలు కూడా పాల్గొనే అవకాశముందని సమాచారం. రానున్న పార్లమెంటు ఎన్నికల్లో డీఎంకే తన కూటమి పార్టీలతో సీట్ల సర్దుబాటు చర్చలు ప్రారంభించింది. డీఎంకే - కాంగ్రెస్ మధ్య సీట్ల సర్దుబాటుపై తొలివిడత చర్చలు ముగిశాయి. గత పార్లమెంటు ఎన్నికల్లో డీఎంకే కూటమిలో కాంగ్రెస్ రాష్ట్రంలో 9 స్థానాలు, పుదుచ్చేరిలో ఒకటి చొప్పున మొత్తం 10 స్థానాల్లో పోటీచేయగా, తేని నియోజకవర్గం మినహా మిగిలిన అన్ని స్థానాల్లో విజయం సాధించింది. రానున్న ఎన్నికల్లో ఆ పార్టీ 15 స్థానాల్లో పోటీ చేయాలని భావిస్తోంది. వాటిలో కనిష్ఠంగా 12 స్థానాలు లభించే అవకాశముందని ఆ పార్టీ నమ్మకంతో ఉంది. అయితే దీనిపై డీఎంకే అధ్యక్షుడు, ముఖ్యమంత్రి స్టాలిన్ తుది నిర్ణయం తీసుకుంటారని ఆ పార్టీ వర్గాలు చెబుతున్నాయి. అదే సమయంలో సీట్ల సర్దుబాటుకు సంబంధించిన రెండో విడత చర్చలు ఈనెల 9న జరుగనున్నట్లు ఇరుపార్టీలు ప్రకటించాయి.

ఖర్గే రాక...

ఈ నేపథ్యంలో, ఈనెల 13న ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే నగరానికి రానున్నారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ ఆధ్వర్యంలో భారీ ఎన్నికల ప్రచార సభ నిర్వహించాలని నిర్ణయించారు. ఈ సభకు పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు కేఎస్ అళగిరి అధ్యక్షత వహించనున్నారు. సభ కోసం నగరంలోని పలు ప్రాంతాలు పరిశీలించినట్లు, మరో రెండు రోజుల్లో వేదిక ప్రాంతాన్ని అధికారికంగా ప్రకటిస్తామని సీనియర్ నేత ఒకరు తెలిపారు. ఈ సభకు కూటమి పార్టీల నేతలను కూడా ఆహ్వానించాలని నిర్ణయించినట్లు సమాచారం. ఇటీవల తిరుచ్చిలో డీఎంకే యువజన విభాగం నిర్వహించిన మహానాడులో కూటమి పార్టీలకు చెందిన జాతీయ, రాష్ట్రస్థాయి నాయకులు పాల్గొన్నారు. అదే క్రమంలో నగరంలో కూడా భారీ బహిరంగ సభ నిర్వహించాలని కాంగ్రెస్ నిర్ణయించింది. అదే సమయంలో నగరానికి రానున్న మల్లికార్జున ఖర్గే ఆ రోజున ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్‌ను కలుసుకోనున్నారు. సీట్ల సర్దుబాటుకు సంబంధించి ఆ రోజు తుది నిర్ణయం వెలువడే అవకాశముందని పార్టీ వర్గాల సమాచారం.

సీట్ల సర్దుబాటుపై కూటమి పార్టీలతో....

పార్లమెంటు ఎన్నికల్లో సీట్ల సర్దుబాటుపై డీఎంకే కూటమి పార్టీలతో చర్చలు జరపనుంది. అందులో భాగంగా శనివారం సీపీఐ, గురువారం సీపీఎం, ఎండీఎంకే నేతలతో సమావేశం కానుంది. అనంతరం డీపీఐ, ముస్లిం లీగ్ పార్టీలతో డీఎంకే సీట్ల సర్దుబాటు కమిటీ సమావేశం కానుంది. ముఖ్యమంత్రి విదేశీ పర్యటన ముగించుకొని ఈ నెల 7వ తేది నగరానికి రానున్న నేపథ్యంలో, కూటమి పార్టీలతో చర్చల సారాంశాన్ని కమిటీ నివేదిస్తుందని పార్టీ వర్గాలు తెలిపాయి.




వైవీ రామకృష్ణ చిత్రపటానికి పూలుచల్లి నివాళి అర్పిస్తున్న ఆచార్య విస్తాలి శంకరరావు, అనీల్‌కుమార్‌రెడ్డి తదితర తెలుగు ప్రముఖులు

సహృదయ శీలి వైవీ రామకృష్ణ

● సంస్మరణ సభలో కొనియాడిన వక్తలు

ప్యారీస్, ఫిబ్రవరి 2: అమరజీవి పొట్టిశ్రీరాములు స్మారక సమితి వ్యవస్థాపకుడు, దివంగత వైవీ రామకృష్ణ సహృదయశీలి అని పలువురు వక్తలు కొనియాడారు. గురువారం రాత్రి కన్నుమూసిన వైవీ రామకృష్ణకు సంతాపం తెలుపుతూ మద్రాసు విశ్వవిద్యాలయ తెలుగు శాఖ ఆధ్వర్యంలో స్థానిక మెరీనా ఆవరణలో శుక్రవారం నివాళి సభను నిర్వహించారు. ఈ సంస్మరణ సభకు మద్రాసు విశ్వవిద్యాలయం తెలుగుశాఖ అధ్యక్షుడు ఆచార్య విస్తాలి శంకరరావు సారథ్యం వహించారు. సభకు విచ్చేసిన తెలుగు ప్రముఖులతో కలసి ఆయన రామకృష్ణ చిత్రపటానికి పూలుచల్లి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... వైవీ రామకృష్ణ సాహితీ సేవకుడని, ఆయన తన జీవితాన్ని, ధనాన్ని తెలుగు సాహితీ సేవలకు వినియోగించిన మహనీయుడని కొనియాడారు. అనేక సాహితీ సంస్థలకు ఆర్థిక సహకారం అందించడమే కాకుండా పేద విద్యార్థులకు ఫీజులు చెల్లించడం, పాఠ్యపుస్తకాలు అందించారని తెలిపారు. సాహితీవేత్త మాలతి చందూర్ రచనలంటే ఆయనకు మహా ఇష్టమని, ఆమె పేరు మీద వివిధ విశ్వవిద్యాలయాల్లో రూ.6 లక్షలు వెచ్చించి ధర్మనిధి ఉపన్యాసాలు నిర్వహించిన మహనీయుడన్నారు. తన తుదిశ్వాస వరకు తెలుగు భాషా సాహిత్యం అంటూ జీవించారని, అడిగిన వారికి కాదనకుండా దానం చేసిన గొప్ప దానశీలి, నిగర్వి, సున్నిత మనస్కుడన్నారు. ఈ రోజు భౌతికంగా ఆయన మనతో లేకపోవడం తెలుగు వారికి, తెలుగు భాష సాహిత్యాలకు తీరని లోటని శంకరరావు తెలిపారు. అనంతరం అమరజీవి పొట్టిశ్రీరాములు స్మారక భవన నిర్వాహక కమిటీ చైర్మన్ కాకుటూరి అనిల్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ... ఎంతటివారైనా ఏదో ఒకరోజు కాల ప్రవాహంలో కలసి పోతుండడం సహజమేనని, రామకృష్ణ సంస్మరణ సభలో కలుసుకోవడం చాలా బాధ అనిపించిందని విచారం వ్యక్తంచేశారు. తెలుగు భాషోద్యమకారులు పొట్టిశ్రీరాములుతో మంచి సంబంధాలు కలిగి, తనకంటూ ఒక మార్గదర్శకం నిర్దేశించుకున్నారని, మాలతి చందూర్ శరీరంలాగే రామకృష్ణ కూడా తన పార్థివదేహాన్ని శ్రీ రామచంద్ర మెడికల్ ఆసుపత్రికి దానం చేశారని కీర్తించారు. రాజధాని కళాశాల విశ్రాంతాచార్యులు ఎల్బీ శంకరరావు మాట్లాడుతూ... సాహితీప్రియులు వైవీ శాస్త్రి కుమారుడు రామకృష్ణ దక్షిణాఫ్రికాలో మంచి ఉద్యోగం సైతం వదులుకొని ఇక్కడకు వచ్చి స్థిరపడ్డారని, తండ్రి అడుగుజాడల్లో నడిచి విభిన్న కార్యక్రమాలు, ఉపన్యాసాలు, గ్రంథావిష్కరణ ద్వారా తెలుగు సాహిత్య సంస్కృతిని పోషించారన్నారు. తెలుగు సాహితీ ప్రియులందరికీ ఆయన మృతి అశనిపాతమైందని అన్నారు. జనని ప్రధాన కార్యదర్శి గుడిమెట్ల చెన్నయ్య మాట్లాడుతూ.. మృదుభాషి, తెలుగుభాషా పోషకులైన రామకృష్ణ తమ సంస్థ పురోభివృద్ధికి సహాయ సహకారాలు అందించిన వితరణ శీలి అని కొనియాడారు. ఈ కార్యక్రమంలో ఇంకా రాజధాని కళాశాల తెలుగు శాఖాధిపతి డాక్టర్ ఎలిజబెత్ జయకుమారి, అమరజీవి పొట్టిశ్రీరాములు స్మారక భవన నిర్వాహక కమిటీ సంయుక్త కార్యదర్శి ఊరా శశికళ, సభ్యురాలు డాక్టర్ ఏవీ శివకుమారి,బాలాంత్రపు లావణ్య, తిరుమల ఆముక్త మాల్యద, ప్రముఖ గాయని అరుణ శ్రీనాథ్, ఎస్‌కేపీడీ మాజీ ట్రస్టీ ఊరా ఆంజనేయులు తదితరులు వైవీ రామకృష్ణకు పుష్పాంజలి ఘటించి తెలుగు భాషాభివృద్ధికి ఆయనచేసిన కృషిని కొనియాడారు.

గవర్నర్లపై చర్యలు తీసుకొనేలా రాజ్యాంగ ధర్మాసనం సవరించాలి

డీఎంకే రాజ్యసభ సభ్యుడు విల్సన్




పెరంబూర్, ఫిబ్రవరి 2: రాష్ట్రాభివృద్ధికి సహకరించకుండా, రాష్ట్రప్రభుత్వంపై విమర్శలు గుప్పిస్తూ నియంతృత్వంగా వ్యవహరిస్తున్న గవర్నర్లపై చర్యలు తీసుకొనేలా రాజ్యాంగ ధర్మాసనంలోని చట్టాన్ని సవరించాలని రాజ్యసభ సభ్యుడు విల్సన్ శుక్రవారం పార్లమెంటులో సావధాన తీర్మానం ప్రవేశపెట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... రాష్ట్రానికి ప్రథమ పౌరుడు గవర్నర్ అని, గవర్నర్లను రాష్ట్రపతి నియమిస్తారన్నారు. ఒక రాష్ట్రానికి ప్రాతినిధ్యం వహిస్తున్న గవర్నర్లు, ఆయా రాష్ట్రప్రభుత్వాలకు సహకరించాలన్నారు. ముఖ్యమంత్రులు, మంత్రులపై ఏవైనా ఆరోపణలు వస్తే వాటిపై చర్యలు తీసుకోవాలంటే గవర్నర్ అనుమతి అవసరమన్నారు. అంతటి బాధ్యతాయుత పదవిలో ఉంటున్న కొన్ని రాష్ట్రాల గవర్నర్లు, రాజ్యాంగం తమకు కల్పించిన అధికారాలు మీరి ఏకచత్రాధిపత్యంగా వ్యవహరిస్తూ, ప్రజలచే ఎన్నుకోబడిన రాష్ట్రప్రభుత్వాలు చేసే తీర్మానాలు ఆమోదించకుండా, ప్రభుత్వాలపై విమర్శలు గుప్పిస్తున్నారన్నారు. ఇలాంటి కక్షపూరిత చర్యలు రాష్ట్రాభివృద్ధికి విఘాతంలా మారుతాయన్నారు. అందువల్ల రాష్ట్ర గవర్నర్లకు అమలు చేస్తున్న ఇమ్యూనిటీ అనే ప్రత్యేక భద్రత కల్పించే విధంగా రాజ్యాంగ ధర్మాసనంలోని సెక్షన్ 364ను సవరించాలని ఎంపీ విల్సన్ తీర్మానంలో పేర్కొన్నారు.

'నామ్ తమిళర్ కట్చి' నేతలపై ఎన్ఐఏ పంజా

తిరుచ్చి, కోవై సహా 6 చోట్ల తనిఖీలు

చెన్నై, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): శ్రీలంక సహా పలు విదేశాల నుంచి 'నామ్ తమిళర్ కట్చి'కి భారీగా నిధులు అందుతున్నాయంటూ వస్తున్న ఆరోపణలను తేల్చేందుకు జాతీయ దర్యాప్తు బృందం (ఎన్ఐఏ) రంగంలోకి దిగింది. అధికారులు శుక్రవారం ఉదయం ఆ పార్టీ నాయకుల గృహాల్లో ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. చెన్నై, తిరుచ్చి, కోయంబత్తూరు, తెన్‌కాశి, ఇలయాన్ కుడి ప్రాంతాల్లో ఒకే సమయంలో ఈ సోదాలు జరిగాయి. శ్రీలకంలో తమిళ ఈలం పోరు ముగిసి నిషేధిత ఎల్టీటీఈ నేత ప్రభాకరన్ మృతి చెందిన తర్వాత ఆ ఉగ్రవాద సంస్థతో నామ్ తమిళర్ కట్చి నేతలు సంబంధాలు కొనసాగిస్తున్నారని, ప్రభాకరన్‌ను మహానాయకుడిగా చిత్రీకరిస్తూ ప్రచారం చేస్తున్నారని, అంతేకాకుండా పలు విదేశాల్లో దాక్కున్న ఎల్టీటీఈ సభ్యులతోనూ సంబంధాలు పెట్టుకున కోట్లాది రూపాయల మేరకు నిధులు పొందుతున్నారని ఆరోపణలు వచ్చాయి.


సాట్టై దురైమురుగన్


తిరుచ్చిలో ఎన్ఐఏ తనిఖీలు జరుగుతున్న సాట్టై దురైమురుగన్ నివాసగృహం వద్ద కాపలా కాస్తున్న పోలీసులు

కొళత్తూరులో...

కొళత్తూరు బాలాజీనగర్‌లో నివసిస్తున్న నామ్ తమిళర్ కట్చి నాయకుడు కంప్యూటర్ ఇంజనీర్ బాలాజీకి చెందిన నివాస గృహంలో ఎన్ఐఏ అధికారులు శుక్రవారం ఉదయం ఆకస్మిక తనిఖీలు జరిపారు. బాలాజీ ప్రస్తుతం బెంగళూరులో బసచేస్తున్నారు. ఏడేళ్లకు పైగా పార్టీలో కీలకపాత్ర పోషిస్తున్న బాలాజీకి విదేశీ ఉగ్రవాద సంస్థలతో సంబంధాలు ఉండవచ్చుననే అనుమానంతో ఐదుగురు ఎన్ఐఏ అధికారులు ఆయన ఇంట్లో సోదాలు జరిపారు. బాలాజీ భార్యను విచారించారు. సుమారు గంటకు పైగా విచారణ జరిగింది.

తిరుచ్చిలో...

తిరుచ్చి వయలూరు రోడ్డు షణ్ముగనగర్‌లోని పార్టీ ప్రచార కార్యదర్శి, యూట్యూబర్ సాట్టై దురైమురుగన్ ఇంట్లో శుక్రవారం వేకువజాము నుంచే తనీఖీలు ప్రారంభించారు. ఆ సమయంలో సాట్టై దురైమురుగన్ ఇంట్లో లేకపోవటంతో ఆయన భార్య వద్ద అధికారులు విచారణ జరిపారు. ఆ సందర్భంగా ల్యాప్‌టాప్, సెల్‌ఫోన్, కొన్ని సిమ్‌కార్డులను స్వాధీనం చేసుకున్నారు. రెండు గంటలపాటు విచారణ జరిగింది. తమిళ జాతీయ ఉద్యమనేత పి.నెడుమారన్ రచించిన రెండు పుస్తకాలను స్వాధీనం చేసుకున్నారు. ఈనెల 7న సాట్టై దురైమురుగన్ చెన్నైలోని తమ కార్యాలయంలో జరిగే విచారణకు హాజరుకావాలంటూ ఆయన భార్యకు సమన్లు అందించారు.

కోయంబత్తూరులో..

కోయంబత్తూరు జిల్లా ఆల్లాదురై ఆర్టీనగర్‌లో నివసిస్తున్న పార్టీ మాజీ నాయకుడు రంజిత్‌కుమార్ ఇంట్లో 12 మంది ఎన్ఐఏ అధికారులు ఉదయం 4 గంటలకు సోదాలు జరిపారు. పార్టీ సాంకేతిక విభాగం సభ్యుడిగా కొన్నేళ్లపాటు పనిచేసిన రంజిత్‌కుమార్ పార్టీ దూరమై యూట్యూబ్ ఛానెల్ నడుపుతున్నారు. ఈ తనిఖీలో కొన్ని కీలక దస్తావేజులను స్వాధీనం చేసుకున్నారు. రంజిత్‌కుమార్ బ్యాంక్ ఖాతాల్లో నిషేధిత ఎల్టీటీఈ సానుభూతిపరులు లక్షలాది రూపాయలను జమ చేసినట్లు అధికారులు గుర్తించారు. ఇదే విధంగా కోయంబత్తూరు కల్లపట్టి సరస్వతి గార్డెన్‌లో పార్టీ నాయకుడు మురుగన్ ఇంట్లోను సోదాలు జరిగాయి. ఈయన కూడా ఎల్టీటీఈ సానుభూతిపరుడు కావడంతో సోదాలు జరిపినట్లు అధికారులు పేర్కొన్నారు. ఇదే విధంగా తెన్‌కాశి జిల్లా విశ్వనాథపేరిలో మదివానన్ అనే పార్టీ సమన్వయకర్త ఇల్లు, ఆయన నడుపుతున్న స్టూడియోలో ఎన్ఐఏ అధికారులు సోదాలు నిర్వహించారు. ఈ రెండు చోట్లా పది మంది ఎన్ఐఏ అధికారులు తనిఖీ జరిపారు. శివగంగ జిల్లా ఇలయాన్‌కుడి సమీపం షగైవరైవెండ్రాన్‌లో విష్ణు అనే పార్టీ ప్రచార ప్రతినిధి ఇంట్లోనూ తనిఖీలు జరిపారు.

బెదిరింపులకు భయపడం: సీమాన్

రాష్ట్రంలో తమ పార్టీకి చెడ్డపేరు తెచ్చేందుకే ఎన్ఐఏ తనిఖీలు నిర్వహించిందని నామ్ తమిళర్ కట్చి అధినేత సీమాన్ ఆరోపించారు. చెన్నైలో ఆయన మీడియాతో మాట్లాడుతూ... తమ పార్టీని బెదిరించే ధోరణితోనే ఈ దాడులు జరిగాయన్నారు. మతతత్వానికి వ్యతిరేకంగా ప్రచారం సాగించే తమ పార్టీని కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం అణచివేసేందుకు ప్రయత్నిస్తోందన్నారు. తమ పార్టీకి విదేశాల నుంచి నిధులు వస్తున్నాయని ఆరోపిస్తున్నారని, ఈ దాడులకు వ్యతిరేకంగా హైకోర్టులో అత్యవసర పిటిషన్‌ను దాఖలు చేశామని తెలిపారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వ బెదరింపులకు తాము భయపడే ప్రసక్తే లేదని చెప్పారు.

సమాచార ద్వని

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

ఐసిఎఫ్, ఫిబ్రవరి 2: విద్యుత్ మార్గాల్లో చేపట్టనున్న మరమ్మతుల కారణంగా పలు ప్రాంతాల్లో శనివారం ఉదయం 9 నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని ఈబీ తెలిపింది. **గిండి:** రాజ్‌భవన్ కాలనీ, కన్నికాపురం 1 నుంచి 34వ వీధి వరకు, వేళచ్చేరి మెయిన్ రోడ్డు, రేస్ వ్యూ కాలనీ 1 నుంచి 3 వీధులు, భారతి నగర్, 5 ఫర్లాంగుల రోడ్డు, రేస్‌కోర్స్ రోడ్డు, ఒండికారన్ రోడ్డు, నెహ్రూ నగర్, పెరియార్ వీధి, టీఎన్‌హెచ్‌బీ కాలనీ, డాక్టర్ అంబేడ్కర్ నగర్, ఇందిరా గాంధీ 1 నుంచి 6 వీధుల వరకు, గణేశ్ నగర్, రంగనాథన్ వీధి, మదియళగన్ వీధి, కన్నగి వీధి, మాధవన్ వీధి, అన్బిల్ ధర్మలింగం వీధి, అన్నాసాలై కొంత భాగం, చిన్నమలై మసీదు కాలనీ, నర్సింహపురం. **ఐటీ కారిడార్:** టైడల్ పార్క్, తరమణి, కానగం, పెరియార్ వీధి, తిరువాన్మియూర్, ఇంద్రనగర్, ఎంజీఆర్ నగర్, సీఎస్‌ఐ ఎస్టేట్, వేళచ్చేరి, అన్నానగర్, 100 అడుగుల రోడ్డు, సీఎస్‌ఐఆర్ రోడ్డు, కందన్‌చావిడి, సీపీటీ ఏరియా, అజెండాస్, గాంధీ నగర్, అడయారు. **అంబత్తూర్:** పాడి, బాలాజి నగర్, పల్లవ వీధి, టీవీఎస్ నగర్, టీవీఎస్ కాలనీ, టీవీఎస్ అవెన్యూ, అన్నై నగర్, అగ్రహారం నార్త్, ఈస్ట్, సెంట్రల్ అవెన్యూలు, శాంతి కాలనీ, పార్క్ రోడ్డు, శ్రీనివాసన్ నగర్, హౌసింగ్ బోర్డు కాలనీ, దక్షిణ, ఉత్తర మాడ వీధులు, భజన ఆలయ వీధి, తారంకుప్పం, సెంథిల్ నగర్, ఎంటీహెచ్ రోడ్డు, పడవట్టమ్మన్ ఆలయ వీధి, వివేకానంద నగర్, మెయిన్ రోడ్డు, డీఆర్‌జే ఆసుపత్రి, మహమ్మద్ హుస్సేన్ కాలనీ, మురుగన్ ఆలయ వీధి, జయంతి నగర్, టీచర్స్ కాలనీ 6,7 మెయిన్ రోడ్లు, గణపతి నగర్, కృష్ణానగర్, తిరుమాళ్ నగర్.

80 వేలమంది టీచర్లకు ట్యాబ్‌లు

ఐసిఎఫ్, ఫిబ్రవరి 2: ప్రాథమిక,మాధ్యమిక పాఠశాలల్లో పనిచేసే 80,000మంది ఉపాధ్యాయులకు ఇంటర్నెట్ సౌకర్యంతో కూడిన ట్యాబ్‌లు, కంప్యూటర్లు అందించనున్నట్లు ప్రాథమిక విద్యా డైరెక్టర్ కన్నప్పన్ తెలిపారు. రాష్ట్రంలో ఉన్నత,మహోన్నత పాఠశాలల్లో మాత్రమే ల్యాబ్‌లున్నాయి. 7,000 మాధ్యమిక పాఠశాలల్లో హైటెక్ ల్యాబ్‌లు వచ్చే విద్యా సంవత్సరం ప్రారంభించనున్నారు. ఇవి మినహా 20,000 ప్రాథమిక పాఠశాలల్లో స్మార్ట్ తరగతులు జూన్ నుంచి అందుబాటులోకి రానున్నాయి. ఈ క్రమంలో ప్రాథమిక, మాధ్యమిక పాఠశాలల్లో విధులు నిర్వహిస్తున్న 80,000మంది ఉపాధ్యాయులకు ట్యాబ్‌లు, కంప్యూటర్లు అందిస్తామని కన్నప్పన్ పేర్కొన్నారు.

హిజ్రాలపై నిఘాకు ప్రత్యేక బృందం

ఐసిఎఫ్, ఫిబ్రవరి 2: హిజ్రాలపై నిఘాకు ప్రత్యేక బృందం తిరుచ్చిలో ఏర్పడింది. తిరుచ్చి జంక్షన్ రైల్వేస్టేషన్, సెంట్రల్ బస్టాండ్, మన్నార్‌పురం జంక్షన్ ప్రాంతాల్లో రాత్రివేళల్లో గుంపులుగా సంచరించే హిజ్రాలు నేరాలకు పాల్పడుతున్నట్లు పోలీసులకు ఫిర్యాదులందుతున్నాయి. రాత్రివేళల్లో వారిపై నిఘాకు స్పెషల్ టీంను పోలీసుశాఖ ఏర్పాటు చేసింది.ముగ్గురు మహిళా ఇన్‌స్పెక్టర్లనేతృత్వంలో 18మంది పోలీసులు మూడు బృందాలుగా రాత్రి గస్తీపనులు చేపడుతున్నారు.

128 రైల్వేస్టేషన్లలో సీసీ కెమెరాలు

ఐసిఎఫ్, ఫిబ్రవరి 2: చెన్నై రైల్వే డివిజన్‌లో 128 రైల్వేస్టేషన్లలో జూలైలోపు సీసీ టీవీ కెమెరాలు ఏర్పాటు చేయనున్నట్లు అధికారులు తెలిపారు. చెన్నై రైల్వే డివిజన్ పరిధిలోని స్టేషన్లను ప్రతిరోజు 10 లక్షల మంది వినియోగిస్తున్నారు. ఈ ఆర్థిక సంవత్సరంలో ఇప్పటి వరకు రూ.3,236.56 కోట్లు ఆదాయం వచ్చిందని, గత ఆర్థిక సంవత్సరం కన్నా ఇది 4.7 శాతం ఎక్కువని తెలిపారు. ఈక్రమంలో రూ.63.2 కోట్లతో రైల్వేస్టేషన్లలో మౌలిక వసతులు కల్పిస్తున్నామని చెప్పారు. ఇందులో భాగంగా జూలైలోపు 128 స్టేషన్లలో కెమెరాలు అమర్చనున్నామని పేర్కొన్నారు.

ఉపకారవేతనానికి దరఖాస్తుల ఆహ్వానం

ఐసిఎఫ్, ఫిబ్రవరి 2: క్రైస్తవులుగా మారిన ఆదిద్రావిడ విద్యార్థులు విద్యా ఉపకారవేతనానికి దరఖాస్తు చేసుకోవాలని ఎస్సీ, ఎస్టీ సంక్షేమ శాఖ కార్యదర్శి తెలిపారు. ఈ శాఖ ద్వారా కేంద్రప్రభుత్వ నిధుల పంపిణీతో పనిచేసే పోస్ట్ మెట్రిక్ విద్యా ఉపకారవేతన పథకం, ప్రీ మెట్రిక్, పారిశుధ్య కార్మికుల పిల్లల విద్యా ఉపకారవేతనం పథకం, రాష్ట్రప్రభుత్వ ప్రత్యేక పోస్ట్ మెట్రిక్ విద్యా ఉపకారవేతనం పథకం, ఉన్నత విద్యా ప్రత్యేక ఉపకారవేతనం పథకం సహా వివిధ పథకాలు అమలులో ఉన్నాయి. ఈ పథకాల ద్వారా 14 లక్షల మందికి పైగా ఎస్సీ, ఎస్టీలు, క్రైస్తవులుగా మారిన ఆదిద్రావిడులు లబ్ధి పొందుతున్నారు. 2023-24 విద్యా సంవత్సరానికి సంబంధించిన రెన్యువల్ దరఖాస్తులను https://ssp.tn.gov.in లో డౌన్‌లోడ్ చేసుకొని పూర్తిచేసి పంపించాలని పాఠశాల ప్రధానోపాధ్యాయులకు ఉత్తర్వులు జారీ అయ్యాయి.

ప్రభుత్వ బస్సుల్లో ప్రయాణించే వారికి బహుమతులు

ఐసిఎఫ్, ఫిబ్రవరి 2: సాధారణ రోజుల్లో ప్రభుత్వ బస్సుల్లో ప్రయాణించడాన్ని ప్రోత్సహించేందుకు ముగ్గురు ప్రయాణికులను ఎంపిక చేసి వారికి తలా రూ.10,000 బహుమతి అందిస్తామని రవాణా శాఖ తెలిపింది. రాష్ట్రప్రభుత్వ రవాణా సంస్థల దూరప్రాంతాలకు వెళ్లే బస్సుల్లో ఇబ్బందులు లేకుండా ప్రయాణించేలా వెబ్‌సైట్, యాప్‌లు అందుబాటులో ఉన్నాయి. వారాంతపు సెలవు రోజులు, పండుగ దినాలు మినహా ఇతర రోజుల్లో రిజర్వేషన్ చేయించుకొని ప్రయాణించడాన్ని ప్రోత్సహించేలా ప్రతి నెలా సాధారణ రోజుల్లో ప్రయాణించే ముగ్గురు ప్రయాణికులను డ్రా పద్ధతిలో ఎంపిక చేసి వారికి నగదు బహుమతి అందజేయనున్నారు. ఈ ప్రకారం గత నెల ముగ్గురు ఎంపిక, వారికి తలా రూ.10 వేలు మంత్రి శివశంకర్ అందజేశారు.

8న సర్టిఫికెట్ల పరిశీలన

ఐసిఎఫ్, ఫిబ్రవరి 2: జూనియర్ టెక్నికల్ అసిస్టెంట్ పోస్టుల భర్తీకి ఈనెల 8వ తేది సర్టిఫికెట్ల పరిశీలన జరగనుందని టీఎన్‌పీఎస్సీ కార్యదర్శి గోపాల సుందరరాజు తెలిపారు. ఈ పోస్టుల భర్తీకి గత ఏడాది అక్టోబరు 5, 6 తేదీల్లో రాతపరీక్ష జరగ్గా, మార్కులు, ర్యాంకుల జాబితా నవంబరు 28వ తేది విడుదలయ్యాయి. సర్టిఫికెట్ల పరిశీలన ఈనెల 8వ తేది బ్రాడ్‌వేలో ఉన్న టీఎన్‌పీఎస్సీ కార్యాలయంలో జరగనుంది. ఇతర వివరాలకు టీఎన్‌పీఎస్సీ వెబ్‌సైట్‌లో చూడొచ్చు.

12 నుంచి గ్రూప్-2 ఇంటర్వ్యూలు

పెరంబూర్, ఫిబ్రవరి 2: గ్రూప్-2 పోస్టుల ఇంటర్వ్యూలు ఈనెల 12 నుంచి 17వ తేది వరకు జరుగుతాయని టీఎన్‌పీఎస్సీ ఒక ప్రకటనలో తెలిపింది. 161 పోస్టుల భర్తీకి సంబంధించిన ఇంటర్వ్యూలు చేపట్టామని, నియామకాలు పారదర్శకంగా ఉంటాయని, అభ్యర్థులు దళారులను నమ్మి మోసపోవద్దని టీఎన్‌పీఎస్సీ విజ్ఞప్తి చేసింది.

9న పుదుచ్చేరిలో పుష్ప ప్రదర్శన

పుదుచ్చేరి, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): ఈనెల 9వ తేదీ నుంచి పుదుచ్చేరిలో రాష్ట్ర హార్టికల్చర్ విభాగం ఆధ్వర్యంలో 34వ వార్షిక ఫల పుష్ప ప్రదర్శన ప్రారంభంకానుంది. ఈనెల 11వ తేదీ వరకు జరిగే ఈ ప్రదర్శనను పుదుచ్చేరి ప్రభుత్వ వ్యవసాయ, రైతు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో అన్ని రకాల ఫలాలు, పుష్పాలను ప్రదర్శనకు ఉంచనున్నారు. ఈ ప్రదర్శనను తిలకించేందుకు వచ్చే విద్యార్థులకు వివిధ రకాలైన పోటీలను నిర్వహించి బహుమతులు అందిస్తారు.

నెలరోజుల్లో 18 లక్షలమందికి కొత్త ఓటరు గుర్తింపుకార్డులు

- పేరు నమోదుకు అవకాశం
- రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారి సత్యప్రదసాహు



పెరంబూర్, ఫిబ్రవరి 2: కొత్తగా ఓటరు జాబితాలో చేరిన వారు సహా 18 లక్షలమందికి కొత్త ఓటరు గుర్తింపుకార్డులను నెలరోజుల్లో స్పీడ్ పోస్ట్ ద్వారా పంపించనున్నట్లు రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారి సత్యప్రదసాహు తెలిపారు. ఈ విషయమై ఆయన మీడియాతో మాట్లాడుతూ... పార్లమెంటు ఎన్నికల విషయానికొస్తే, ఇప్పటికే జిల్లా ఎన్నికల అధికారులు, ఎన్నికలు జరిపే అధికారులకు ఎన్నికల కమిషన్ సూచనలు, సలహాలను ఇటీవల వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అందించామన్నారు. ప్రస్తుతం సహాయ ఎన్నికల అధికారులకు శిక్షణ జరుగుతోందని తెలిపారు. మండలాల వారీగా 250 మంది సహాయ ఎన్నికల అధికారులున్నారని, వీరిలో మదురై, తిరుచ్చి, కోయంబత్తూర్‌లకు చెందిన అధికారులకు ఇప్పటికే శిక్షణ పూర్తి చేశామన్నారు. అలాగే, చెన్నై కార్పొరేషన్ కార్యాలయం రిప్పన్ భవనంలో రెండు ప్రాంతాల అధికారులకు శిక్షణ తరగతులు జరుగుతున్నాయని, మిగిలిన మండల అధికారులకు ఈనెల 5 నుంచి 9వ తేది వరకు శిక్షణ ఇస్తామన్నారు. ప్రస్తుతం శిక్షణలో ఉన్న సహాయ ఎన్నికల అధికారులు జిల్లా స్థాయి అధికారులకు శిక్షణ ఇస్తారని తెలిపారు. అలాగే, దేశవ్యాప్తంగా ఎన్నికల ఇన్‌చార్జులుగా ఉన్న పోలీసు అధికారులకు ఢిల్లీలో ఎన్నికల సంఘం శిక్షణ ఇస్తుందన్నారు. పార్లమెంటు ఎన్నికల్లో వినియోగించనున్న ఈవీఎంల తొలివిడత పరిశీలన పూర్తిచేసి సిద్ధంగా ఉన్నాయని, ప్రధాన ఎన్నికల కమిషన్ ఉత్తర్వులతో తదుపరి పరిశీలన చేపట్టనున్నట్లు సాహు తెలిపారు.

పేరు నమోదుకు అవకాశం...

తుది ఓటరు జాబితా ఇటీవల విడుదల కాగా, అందులో లోపాలను ఎవరూ తెలియజేయలేదన్నారు. తుది ఓటరు జాబితాలో కొత్త ఓటర్లుగా చేరిన వారు, చిరునామా, తదితరాల కోసం దరఖాస్తు సమర్పించిన మొత్తం 18 లక్షల మందికి కొత్త ఓటరు గుర్తింపుకార్డులు అందిస్తామన్నారు. కొత్తగా పేరు నమోదు, పేరు తొలగించినట్లయితే మళ్లీ చేర్చడం తదితరాలకు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. ఎన్నికల తేది ప్రకటిస్తే, అభ్యర్థుల నామినేషన్ దాఖలుకు 10 రోజుల ముందు వరకు పేర్లు చేర్చనున్నట్లు ఎన్నికల ప్రధానాధికారి సత్యప్రదసాహు తెలిపారు.

సహకార సంఘాలకు రూ.225 కోట్ల సబ్సిడీ

ఐసిఎఫ్, ఫిబ్రవరి 2: సహకార సంఘాలకు రూ.225 కోట్ల సబ్సిడీని ప్రభుత్వం విడుదల చేసింది. రాష్ట్ర సహకార సంఘాల ద్వారా 33 వేలకు పైగా రేషన్ దుకాణాలు పని చేస్తున్నాయి. ఈ రేషన్ దుకాణాల భవనాల అద్దె, ఉద్యోగుల వేతనం, విద్యుత్ బిల్లు, వస్తువులు తరలించే లారీల అద్దె వంటి ఖర్చులను సహకార సంఘాలు తమ విక్రయాల ద్వారా లభించే ఆదాయంతో భరిస్తున్నాయి. దీంతో పాటు ప్రభుత్వం సబ్సిడీ కూడా అందిస్తోంది. 2020-21 సంవత్సరంలో 50 శాతం సబ్సిడీని విడుదల చేయనున్నట్లు గత ఏడాది నవంబరులో ప్రభుత్వం ప్రకటించింది. ఈ సబ్సిడీ రూ.225 కోట్లను ప్రభుత్వం విడుదల చేసింది.

రూ.8 కోట్ల స్థలం స్వాధీనం

ఐసిఎఫ్, ఫిబ్రవరి 2: తెన్‌కాశిలో రూ.8 కోట్ల విలువైన ఆలయ స్థలాన్ని దేవాదాయ శాఖ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. కీలంగాడు జమదగ్నీశ్వర్ ఆలయం, ఇలత్తూర్ మధునాథస్వామి ఆలయం, పులియరై కృష్ణస్వామి ఆలయాలకు సొంతమైన స్థలాలను కొంతమంది ఆక్రమించినట్లు దేవాదాయ శాఖకు ఫిర్యాదులందాయి. సుమారు రూ.8 కోట్ల విలువైన ఈ భూములు, స్థలాలను అధికారులు స్వాధీనం చేసుకుని, అవి సంబంధిత ఆలయ స్థలాలని బోర్డులు ఏర్పాటు చేశారు.

ఆరు నెలల్లో అందుబాటులోకి కీలంబాక్కం రైల్వేస్టేషన్

ఐసిఎఫ్, ఫిబ్రవరి 2: కిలంబాక్కం రైల్వేస్టేషన్ నిర్మాణ పనులు ముమ్మరంగా జరుగుతున్నాయని, ఆరు నెలల్లో అందుబాటులోకి వస్తుందని దక్షిణ రైల్వే జనరల్ మేనేజర్ ఆర్‌ఎం సింగ్ తెలిపారు. రైల్వే పథకం పనుల కోసం కొన్ని ప్రాంతాల్లో స్థల సేకరణకు సంబంధించి రాష్ట్రప్రభుత్వంతో చర్చలు జరుగుతున్నాయన్నారు. నగరంలో 4వ రైల్ టెర్మినల్‌గా విల్లివాక్కం రైల్వేస్టేషన్‌ను అభివృద్ధి చేయనున్నామని, నాలుగు నెలల్లో నివేదిక సిద్ధం చేసి రైల్వే శాఖకు పంపించి పనులు ప్రారంభిస్తామన్నారు. కీలంబాక్కం రైల్వేస్టేషన్ నిర్మాణపనులకు రాష్ట్రప్రభుత్వం రూ.20 కోట్లు కేటాయించిందని, ఈ పనులు ఆరు నెలల్లో పూర్తికానున్నాయని తెలిపారు. చెన్నై బీచ్-ఎగ్మూర్ మధ్య నాల్గో మార్గం పనులు జూన్‌లోగా పూర్తవుతాయని తెలిపారు.

ప్రభుత్వ ఆదాయానికి నష్టం

- ఇద్దరు మహిళా సర్పంచుల తొలగింపు

పెరంబూర్, ఫిబ్రవరి 2: ప్రభుత్వ ఆదాయానికి నష్టం కలిగించిన ఇద్దరు మహిళా సర్పంచులను పదవుల నుంచి తొలగిస్తూ జిల్లా కలెక్టర్ ఉత్తర్వులు జారీ చేశారు. తిరువళ్లూర్ జిల్లా కడంబత్తూర్ పంచాయతీ యూనియన్ పరిధిలో వెంగత్తూర్ పంచాయతీ సర్పంచు పి.సునీత, ప్రభుత్వానికి రూ.19,42,171 నిధులు చెల్లించలేదని విచారణలో తేలింది. అలాగే, ఎల్లాపురం పంచాయతీ యూనియన్ పరిధిలోని తామరైపాక్కం సర్పంచు గీత తులసిరామన్, ప్రభుత్వానికి రూ.40 లక్షలు చెల్లించలేని విచారణలో తేలింది. దీంతో వారిద్దరూ అధికారాన్ని దుర్వినియోగం చేశారంటూ, రాష్ట్ర స్థానిక సంస్థల చట్టం 1994 విభాగం 205 ప్రకారం మహిళా సర్పంచులు సునీత, గీతను పదవుల నుంచి తొలగిస్తూ జిల్లా కలెక్టర్ ప్రభుశంకర్ ఉత్తర్వులు జారీ చేశారు.

మా హయాంలోనే కుంభాభిషేకాలు

- మంత్రి శేఖర్‌బాబు వెల్లడి



ఆలయ జీర్ణోద్ధరణ పనులను ప్రారంభిస్తున్న దేవాదాయ శాఖ మంత్రి పీకే శేఖర్‌బాబు

అడయార్, ఫిబ్రవరి 2: రాష్ట్రంలో డీఎంకే ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాతే అధిక సంఖ్యలో ఆలయాలకు కుంభాభిషేకాలు జరిగాయని రాష్ట్ర హిందూ దేవాదాయ ధర్మాదాయ శాఖ మంత్రి పీకే శేఖర్ బాబు చెప్పారు. కరూర్ జిల్లాలోని నెరూర్ సమీపంలోని తిరుముక్కూడనూరులో వెయ్యేళ్ల నాటి పురాతన అగస్తీశ్వరర్ ఆలయాన్ని రూ.5 కోట్లతో జీర్ణోద్ధారణ పనులు చేపట్టనున్నామని చెప్పారు. ఈ పనులకు మంత్రి శుక్రవారం శంకుస్థాపన చేశారు. జీర్ణోద్ధారణ పనులు పూర్తి చేసి, 2026లో కుంభాభిషేకం నిర్వహిస్తామన్నారు. గత యేడాది 113 ఆలయాలకు కుంభాభిషేకం నిర్వహించామని, ఈ యేడాది 84 ఆలయాలకు నిర్వహిస్తామన్నారు.

చిన్న రుణాలకు గడువు పొడిగింపు

పెరంబూర్, ఫిబ్రవరి 2: మిచౌంగ్ తుఫానుతో నష్టపోయిన సంస్థలకు 'టిక్' రాష్ట్రప్రభుత్వ పరిశ్రమల పెట్టుబడుల సమాఖ్య ద్వారా ప్రత్యేక రుణాలు అందించే పథకం అమలులో ఉంది. సంస్థకు అధికంగా రూ.3 లక్షల వరకు రుణం అందిస్తుండగా, వడ్డీ 6 శాతంగా నిర్ణయించారు. ఈ పథకం గురువారంతో ముగియగా, సంస్థల విజ్ఞప్తి మేరకు ఈనెల 15వ తేది వరకు పొడిగించినట్లు టిక్ తెలిపింది.

కేంద్రం తీరు, గవర్నర్ల వైఖరిని నిరసిస్తూ 8న ఆందోళనలు

పెరంబూర్, ఫిబ్రవరి 2: కేంద్ర ప్రభుత్వ తీరు, గవర్నర్ల వైఖరిని నిరసిస్తూ ఈ నెల 8న రాష్ట్రవ్యాప్త ఆందోళనలు చేపట్టనున్నట్లు సీపీఎం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.బాలకృష్ణన్ ప్రకటించారు. బీజేపీ అధికారంలోలేని రాష్ట్రాలపై కేంద్రప్రభుత్వం నిర్లక్ష్య వైఖరి చూపడంతో పాటు గవర్నర్లను ఏజెంట్లుగా ఆయా ప్రభుత్వాలను ఇబ్బందులు పెడుతోందన్నారు. ఇక ఆ రాష్ట్రాలు అసెంబ్లీలో చేసిన తీర్మానాలను గవర్నర్లు ఆమోదం తెలపకుండా చెత్తబుట్టలో వేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. కేంద్రం తీరు, గవర్నర్ వైఖరిని నిరసిస్తూ ఈ నెల 8న ఢిల్లీలో కేరళ ముఖ్యమంత్రి పినరయి విజయన్ ధర్నా చేపట్టనున్నట్లు ప్రకటించారని, ఆయనకు సంఘీభావంగా ఆ రోజున జిల్లా ప్రధాన కేంద్రాల్లో ఆందోళనలు చేపట్టనున్నట్లు బాలకృష్ణన్ తెలిపారు.

అన్నా స్క్వేర్‌లో మరమ్మతులు

- నేడు నేతల నివాళికి ప్రత్యామ్నాయ ఏర్పాట్లు

పెరంబూర్, ఫిబ్రవరి 2: అన్నా స్క్వేర్‌లో మరమ్మతులు జరుగుతుండడంతో, శనివారం అన్నా వర్ధంతి సందర్భంగా ఆయనకు నివాళి అర్పించేలా ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేపట్టారు. స్థానిక కామరాజర్ రోడ్డులోని అన్నా స్క్వేర్‌లో మరమ్మతులు పనులు జరుగుతున్నాయని, అదే సమయంలో శనివారం అన్నా 55వ వర్ధంతి సందర్భంగా, అన్నా, పురట్చి తలైవర్ ఎంజీఆర్ స్మారక సమాధుల మధ్య అన్నా చిత్రపటం ఏర్పాటు చేయనున్నారు. రాజకీయ పార్టీలు, సంస్థలు, ప్రజలు అన్నా చిత్రపటానికి పూలుచల్లి నివాళి అర్పించవచ్చని ప్రకటనలో పేర్కొన్నారు.

చెన్నై - హాంకాంగ్ విమాన సేవలు ప్రారంభం

పెరంబూర్, ఫిబ్రవరి 2: చెన్నై - హాంకాంగ్ మధ్య విమాన సేవలు శుక్రవారం నుంచి ప్రారంభమయ్యాయి. కరోనా కారణంగా 2020 మార్చి నుంచి ఈ విమాన సేవలు రద్దయ్యాయి. ప్రస్తుతం సాధారణ స్థితి నెలకొని పలు దేశాలకు విమానాలు నడుపుతున్న నేపథ్యంలో, చెన్నై - హాంకాంగ్ విమాన సేవలు కూడా మళ్లీ ప్రారంభమయ్యాయి. ప్రస్తుతం బుధ, శుక్ర, ఆదివారాల్లో మాత్రమ నడుపనున్న విమానాలను త్వరలో అన్ని రోజుల్లో నడిపేలా చర్యలు చేపట్టినట్లు విమానాశ్రయ అధికారులు తెలిపారు.

వేగవంతమైన ఇంటర్నెట్ సేవలు

హైకోర్టు ప్రథమ ధర్మాసనం

పెరంబూర్, ఫిబ్రవరి 2: మద్రాసు హైకోర్టు ప్రాంగణంలో వేగవంతమైన సెల్‌ఫోన్ నెట్‌వర్క్ అందించే అంశం పరిశీలనలో ఉందని ప్రధాన న్యాయమూర్తితో కూడిన ధర్మాసనం తెలియజేసింది. తిరుముల్లైవాయల్‌కు చెందిన న్యాయవాది ఎల్కే చార్లెస్ మద్రాసు హైకోర్టులో దాఖలు చేసిన పిటిషన్‌లో... మద్రాసు హైకోర్టు ప్రాంగణంలో సెల్‌ఫోన్ నెట్‌వర్క్ సక్రమంగా లేకపోవడంతో ఇంటర్నెట్ సేవల్లో జాప్యం జరుగుతోందన్నారు. ముఖ్యంగా, వీడియో కాన్ఫరెన్స్ ద్వారా కేసుల విచారణ సమయంలో ఇలాంటి సమస్య ఎదురవుతోందని, అలాగే, మద్రాసు హైకోర్టులో విచారణకు హాజరయ్యే న్యాయవాదులు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఇతర కోర్టుల్లో జరిగే విచారణకు సకాలంలో హాజరు కాలేక పోతున్నారని పేర్కొన్నారు. ఇక, రోజూ అప్‌లోడ్ చేసే కేసుల జాబితా, కేసుల విచారణ స్థితి, హైకోర్టు ఉత్తర్వులు చూడలేక పోతున్నామని తెలిపారు. అందువల్ల హైకోర్టు ప్రాంగణంలో సెల్‌ఫోన్ నెట్‌వర్క్ పెంచేలా చర్యలు చేపట్టాలని ఇదివరకే హైకోర్టు రిజిస్ట్రార్, రాష్ట్రప్రభుత్వానికి విన్నవించామన్నారు. వారి నుంచి ఎలాంటి సమాధానం లేకపోవడంతో తాము కోర్టును ఆశ్రయించినట్లు పేర్కొన్నారు. ఈ పిటిషన్‌ను విచారించిన ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఎస్వీ గంగాపూర్‌వాలా, న్యాయమూర్తి భరత్ చక్రవర్తిలతో కూడిన ప్రథమ ధర్మాసనం, ఇది ఇప్పటికే హైకోర్టు రిజిస్ట్రార్ పరిశీలనలో ఉందని పేర్కొంటూ కేసు విచారణ ముగిసినట్లు ఉత్తర్వులు జారీ చేశారు.

మధ్యాహ్న భోజనం పరిశీలన



విద్యార్థులతో మాట్లాడుతున్న కలెక్టర్ సుబ్బులక్ష్మి

వేలూరు, ఫిబ్రవరి 2: స్థానిక అల్లాపురంలో ఉన్న పంచాయతీ యూనియన్ పాఠశాలను శుక్రవారం కలెక్టర్ సుబ్బులక్ష్మి పరిశీలించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు అందిస్తున్న ఆహార పదార్థాలను పరిశీలించారు. పాఠశాలలో బోధించడంపై ఉపాధ్యాయులకు కలెక్టర్ సూచనలు, సలహాలు అందించారు. అనంతరం పెండెలెంట్ ఆసుపత్రిలో ప్రాంగణంలో రూ.150 కోట్ల తో చేపట్టిన మల్టీ స్పెషాలిటీ ఆసుపత్రి నిర్మాణ పనులను కలెక్టర్ పరిశీలించారు. ప్రభుత్వ వైద్యకళాశాల ఆసుపత్రి ప్రిన్సిపాల్ పాల్ పాపాత్తి, వైద్య సూపరింటెండెంట్ రతి తిలకం, ప్రధాన విద్యాధికారి మణిమొళి, జిల్లా విద్యాధికారి నేసప్రభ, పీడబ్ల్యూడీ అధికారులు పాల్గొన్నారు.

ఇసుక రీచ్‌లలో తనిఖీలు

రూ.130 కోట్ల ఆస్తుల స్తంభన: ఈడీ

పెరంబూర్, ఫిబ్రవరి 2: ఇసుక రీచ్‌లలో చేపట్టిన తనిఖీల ఆధారంగా రూ.130 కోట్ల ఆస్తులు స్తంభింపజేసినట్లు ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ తెలిపింది. రాష్ట్రంలోని ఇసుక రీచ్‌లలో ప్రభుత్వం నిర్ణయించిన దానికన్నా అధికంగా ఇసుకను తరలించి విక్రయిస్తున్నారని, ఆ ఆదాయాన్ని చట్టవ్యతిరేకంగా బట్వాడా చేస్తున్నారని ఫిర్యాదులున్నాయి. దీంతో గత ఏడాది ఈడీ అధికారులు ఒకే సమయంలో, జలవనరుల శాఖ అధికారులు, ఇసుక రీచ్‌ల యజమానుల ఇళ్లు అని 34 ప్రాంతాల్లో తనిఖీలు చేపట్టారు. రూ.128.4 కోట్ల చరాస్తులు, 209 యంత్రాలు, కాంట్రాక్టర్లు షణ్ముగం రామచంద్రన్, కరుపయ్యా రత్నం, పన్నీర్‌సెల్వం, కరికాలన్ తదితరుల 35 బ్యాంక్ ఖాతాల్లోని రూ.2.25 కోట్ల నగదు స్తంభింపజేశామని ఈడీ తెలిపింది.

గూడువాంజేరి చెరువు నుంచి తాగునీరు

పెరంబూర్, ఫిబ్రవరి 2: నగర శివారులోని గూడువాంజేరి చెరువు నుంచి వండలూరు, ఊరపాక్కం, మరమలైనగర్‌కు తాగునీరు సరఫరా చేయనున్నారు. నగరవాసుల తాగునీటి అవసరాలను పూండి, పుళల్, చెంబరంబాక్కం, చోళవరం, తేర్వాయి కండిగై తదితర జలాశయాలు భర్తీ చేస్తున్నాయి. వేసవిలో తలెత్తే తాగునీటి ఎద్దడిని నివారించేలా నగర శివారు ప్రాంతాల్లో క్వారీలు, చెరువుల్లోని నీటిని శుద్ధీకరించి నగరంలో పలు ప్రాంతాలకు సరఫరా చేస్తున్నారు. ఈ నేపథ్యంలో, 20 హెక్టార్ల విస్తీర్ణం కలిగిన గూడువాంజేరి చెరువు ద్వారా కాటాన్‌కొళత్తూర్ ప్రాంతంలోని సుమారు 65 హెక్టార్లకు సాగు నీరు అందుతోంది. ఇటీవల కురిసిన వర్షాల కారణంగా ఈ చెరువు గట్టు దెబ్బతినింది. సుమారు 1.5 కి.మీ మేర గట్టు పునరుద్ధరించే పనులు శరవేగంగా జరుగుతున్నాయి. ఈ పనులు మార్చి, ఏప్రిల్ లోపు పూర్తిచేయాలని నిర్ణయించినట్లు, అనంతరం ఈ చెరువు నీటిని శుద్ధీకరించి వండలూరు, ఊరపాక్కం, మరమలై నగర్ ప్రాంతవాసులకు తాగునీరుగా అందజేయనున్నట్లు అధికారులు తెలిపారు.

5కు మాజీ డీజీపీ కేసు విచారణ వాయిదా

పెరంబూర్, ఫిబ్రవరి 2: మూడేళ్ల జైలుశిక్షను వ్యతిరేకిస్తూ మాజీ ప్రత్యేక డీజీపీ రాజేష్‌దాస్ అప్పీలు పిటిషన్ విచారణను ఈనెల 5వ తేదీకి విల్లుపురం కోర్టు వాయిదా వేసింది. రెండో రోజు శుక్రవారం కోర్టుకు హాజరైన మాజీ డీజీపీ సుమారు ఒకటిన్నర గంట తన వాదనలు వినిపించారు. మహిళా ఐపీఎస్ అధికారిని లైంగికంగా వేధించారనే కేసులో రాజేష్‌దాస్‌కు న్యాయస్థానం మూడేళ్ల జైలు శిక్ష విధించిన విషయం తెలిసిందే.

గవర్నర్‌కు నల్ల జెండాలతో నిరసన

అడయార్, ఫిబ్రవరి 2: తంజావూరు జిల్లా కుంభకోణం పర్యటనకు వెళ్లిన రాష్ట్ర గవర్నర్ రవికి ఉభయ కమ్యూనిస్టు పార్టీల నేతలు, కార్యకర్తలు నల్లజెండాలతో నిరసన తెలిపారు. దీంతో అక్కడ కొద్దిసేపు ఉద్రిక్త వాతావరణం నెలకొంది. ఆ తర్వాత పోలీసులు రంగప్రవేశం చేసి నిరసనకారులను అదుపులోకి తీసుకున్నారు. కుంభకోణం సమీపంలో 800 యేళ్లనాటి పురాతన నాయకి అమ్మాళ్ సమేత కంభకేశ్వరర్ ఆలయం ఉంది. ఈ ఆలయ కుంభాభిషేకం శుక్రవారం ఉదయం 9.50 గంటలకు జరిగింది. ఇందులో గవర్నర్ రవి, మద్రాస్ హైకోర్టు న్యాయమూర్తి ఆదికేశవులు, ధర్మపురి ఆధీనం 27వ నక్షత్ర గురుమణి మాసిలామణి దేశికర్ జ్ఞానసంబంధ పరమాచార్య స్వామి తదితరులు పాల్గొన్నారు. అయితే, గవర్నర్ రాకను తెలుసుకున్న కమ్యూనిస్టు పార్టీలకు చెందిన నేతలు, కార్యకర్తలు భారీగా చేరుకుని నల్లజెండాలతో నిరసన తెలుపుతూ నినాదాలు చేశారు.

అన్నాడీఎంకే ప్రధాన కార్యదర్శి అన్నామలై

- నోరుజారిన దిండిగల్ శ్రీనివాసన్

అడయార్, ఫిబ్రవరి 2: అన్నాడీఎంకే సీనియర్ నేత, మాజీ మంత్రి, ఆ పార్టీ కోశాధికారి దిండిగల్ శ్రీనివాసన్ మళ్లీ నోరుజారారు. అన్నాడీఎంకే ప్రధాన కార్యదర్శి అన్నామలై అంటూ ఆయన చేసిన వ్యాఖ్యలు సోషల్ మీడియాలో వైరల్ అయ్యాయి. గతంలో కూడా అనేక బహిరంగ సభల్లో నోరుజారడటం ఆ తర్వాత నాల్కుకరచుకోవడం పరిపాటిగా మారింది. గురువారం రాత్రి దిండిగల్ జిల్లాలో జరిగిన కార్యక్రమం అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ... ప్రధాని నరేంద్రమోదీ సారథ్యంలోని బీజేపీ ప్రభుత్వం ఉమ్మడి పౌర స్మృతి (సీఏఏ) అమలును అడ్డుకుంటామంటూ వ్యాఖ్యానించారు. ఆ సమయంలో విలేకరి.. గతంలో బీజేపీతో పొత్తు ఉన్నపుడు ఈ చట్టాన్ని ఎందుకు వ్యతిరేకించలేదని ప్రశ్నించారు. దీనికి ఆయన సమాధానమిస్తూ, ఈ ప్రశ్నలన్నింటికీ తమ పార్టీ ప్రధాన కార్యదర్శి అన్నామలై గతంలోనే సమాధానం చెప్పారని వ్యాఖ్యానించారు. అన్నాడీఎంకే ప్రధాన కార్యదర్శి ఎడప్పాడి పేరు చెప్పడానికి బదులు అన్నామలై పేరును చెప్పడంతో విలేకరులతో పాటు అన్నాడీఎంకే నేతలు, కార్యకర్తలు సైతం అవాక్కయ్యారు.



భారత రాష్ట్రపతి ద్రౌపదిముర్మురును ఢిల్లీలో మర్యాదపూర్వకంగా కలుసుకున్న, జాతీయ మహిళా కమిషన్ సభ్యురాలు, బీజేపీ నాయకురాలు ఖుష్బూ

క్రేన్ విరిగిపడి ముగ్గురు కార్మికులకు తీవ్రగాయాలు

ఐసిఎఫ్, ఫిబ్రవరి 2: పాంబన్ కొత్త రైల్వే వంతెన నిర్మాణ పనుల్లో క్రేన్ విరిగిపడి ముగ్గురు కార్మికులు తీవ్రంగా గాయపడ్డారు. రామనాథపురం జిల్లా పాంబన్ సముద్రం మధ్య రూ.550 కోట్లతో కొత్త రైల్వే బ్రిడ్జి నిర్మాణ పనులు జరుగుతున్నాయి. ఈ బ్రిడ్జి మధ్య భాగంలో లిఫ్ట్ వంతెన ఏర్పాటుచేసే పనులు గురువారం చేపడుతున్నప్పుడు, హఠాత్తుగా క్రేన్ విరిగిపడి కింద బోటులో ఉన్న తెరుక్కువాడి గ్రామానికి చెందిన మారియప్పన్, క్రిస్టీ, మారి అనే ముగ్గురు తీవ్రంగా గాయపడ్డారు. వెంటనే వారిని చికిత్స కోసం రామనాథపురం ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

చైనా నుంచి 51 రోజుల తర్వాత స్వగ్రామానికి మెడికో మృతదేహం



మృతురాలు రోహిణి (ఫైల్ ఫోటో)

పెరంబూర్, ఫిబ్రవరి 2: చైనాలో మృతిచెందిన వైద్య విద్యార్థిని మృతదేహం 51 రోజుల అనంతరం స్వగ్రామానికి చేరుకుంది. కన్నియాకుమారి జిల్లా ఇడైకాడు పుల్లందేరికి చెందిన జౌళి వ్యాపారి గోపాలకృష్ణన్ ఏకైక కుమార్తె రోహిణి (27) చైనాలో వైద్య విద్య అభ్యసిస్తోంది. ఈ నెలలో ఆమె చదువు ముగించి స్వగ్రామానికి రానుండడంతో తల్లిదండ్రులు ఆనందంగా ఎదురుచూస్తున్నారు. ఈ నేపథ్యంలో, అనారోగ్యం కారణంగా రోహిణి మృతిచెందినట్టు గోపాలకృష్ణన్‌కు సమాచారం అందింది. రోహిణికి రక్తకణాలు తగ్గడంతో గత నెల 12వ తేది మృతి చెందినట్లు తెలిసింది. దీంతో కుమార్తె మృతదేహాన్ని స్వగ్రామానికి తీసుకొచ్చేలా చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్, రాష్ట్రప్రభుత్వం, కేంద్ర విదేశీ వ్యవహారాల మంత్రిత్వ శాఖకు తల్లిదండ్రులు విజ్ఞప్తి చేశారు. కానీ, న్యాయపరమైన ఇబ్బందుల కారణంగా మృతదేహాన్ని త్వరగా తీసుకొచ్చేందుకు వీలుకాలేదని సమాచారం. రోహిణిని చైనా పంపించిన ఏజెన్సీని తల్లిదండ్రులు కలువగా, మృతదేహం తీసుకొచ్చేందుకు భారీగా ఖర్చవుతుందని తెలిపారు. ఇప్పటికే కుమార్తె విద్య కోసం లక్షలు ఖర్చుపెట్టిన తల్లిదండ్రులు ఏమీ చేయాలో దిక్కుతోచని స్థితికి చేరుకున్నారు. ఈ నేపథ్యంలో, కేంద్ర విదేశీ వ్యవహారాల మంత్రిత్వ శాఖ చొరవతో చైనా నుంచి 51 రోజుల అనంతరం విమానం ద్వారా చెన్నైకి మృతదేహాన్ని తీసుకొచ్చి, అంబులెన్స్ ద్వారా స్వగ్రామానికి తరలించి, అంత్యక్రియలు నిర్వహించారు.

మదురై విమానాశ్రయంలో కిలో బంగారం స్వాధీనం

పెరంబూర్, ఫిబ్రవరి 2: దుబాయ్ నుంచి మదురైకి వచ్చిన విమానంలో అక్రమంగా తరలిస్తున్న కిలో బంగారాన్ని అధికారులు స్వాధీనం చేసుకున్నారు. దుబాయ్ నుంచి వచ్చే స్పైస్ జెట్ విమానంలో బంగారం తరలిస్తున్నట్లు అందిన సమాచారంతో కస్టమ్స్ అధికారులు, ఈ విమాన ప్రయాణికులను తనిఖీ చేశారు. వారిలో దుబాయ్‌కు చెందిన ఓ యువకుడు ధరించిన జీన్స్ ప్యాంట్ లోపలి భాగంలో పేస్ట్ రూపంలో పూసిన రూ.66,67,500 విలువైన కిలో 50 గ్రాముల బంగారం గుర్తించి స్వాధినం చేసుకున్న అధికారులు, ఈ యువకుడిని అదుపులోకి తీసుకొని విచారిస్తున్నారు.

రూ.2.93 కోట్ల మోసం కేసులో అన్నాడీఎంకే నేతల అరెస్టు

అడయార్, ఫిబ్రవరి 2: సేలం జిల్లా ఇడైప్పాడి సమీపంలోని ఒక సహకార బ్యాంకులో జరిగిన రూ.2.93 కోట్ల నిధుల మోసం కేసులో అన్నాడీఎంకేకు చెందిన సహకార బ్యాంకు మాజీ చైర్మన్, డిప్యూటీ మాజీ చైర్మన్లను స్థానిక పోలీసులు అరెస్టు చేశారు. ఇడైప్పాడి సమీపంలోని వెల్లిరైవెల్లిరి అనే ప్రాంతంలో సహకార బ్యాంకు ఉంది. ఇందులో ఆ ప్రాంతానికి చెందిన రైతులు, స్థానికులు వివిధ రకాలైన రుణాలు తీసుకున్నారు. అయితే, ఈ రుణాల మంజూరులో అనే అవకతవకలు జరిగినట్టు తాజాగా వెలుగులోకి వచ్చింది. దీనిపై ఉన్నతాధికారులు జరిపిన విచారణలో చైర్మన్‌గా ఉన్న అన్నాడీఎంకే మహిళా నేత సత్యభాను, డిప్యూటీగా ఉన్న వడివేలు, కార్యదర్శి మోహన్‌తో పాటు మరికొందరు ఈ మోసానికి పాల్పడినట్టు ప్రాథమిక విచారణలో తేలింది. దీనిపై సహకార బ్యాంకు ఉన్నతాధికారులు సేలం జిల్లా ఆర్థిక నేరాల విభాగం పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసి సత్యభామ, వడివేలు, కార్యదర్శి మోహన్‌లను అరెస్టు చేశారు.

అదుపుతప్పిన పోలీసు వాహనం ఢీకొని మహిళ మృతి



బోల్తాపడిన పోలీసు గస్తీ వాహనం

చెన్నై, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): తిరుచ్చి జిల్లా శ్రీలైపెళ్ళయార్‌పుత్తూరులో రెండు వర్గాల మధ్య ఘర్షణను అడ్డుకునే నిమిత్తం వెళ్లిన పోలీసు గస్తీ వాహనం అదుపు తప్పి ఢీకొనడంతో ఓ మహిళ మృతి చెందింది. గురువారం రాత్రి పోలీసులను తీసుకెళ్లిన ఆ వాహనం ఉన్నట్టుండి అదుపుతప్పి అరివళగన్ అనే వ్యక్తి ఇంటిని, సిమెంట్ దుకాణం ముందుభాగాన్ని ఢీకొని రహదారిపై నడచి వస్తున్న తంగరాజ్- మరుదాయి అనే దంపతులపై దూసుకెళ్ళింది. ఈ సంఘటనలో మరుదాయి దుర్మరణం చెందింది. ఈ ప్రమాదంలో దీనదయాళన్, దీపన్ అనే మరో ఇద్దరు కూడా తీవ్రంగా గాయపడ్డారు. ఈ ప్రమాదానికి పోలీసు గస్తీ వాహనాన్ని నడిపిన సాయుధదళం కానిస్టేబుల్ లోకనాయకంను అదుపులోకి తీసుకుని విచారణ జరుపుతున్నారు.

కోయంబేడు నుంచే ప్రభుత్వ, ప్రైవేటు బస్సులు

- అన్నామలై డిమాండ్

పెరంబూర్, ఫిబ్రవరి 2: కీలంబాక్కం బస్ టెర్మినల్‌లో పూర్తిస్థాయి వసతులు కల్పించే వరకు కోయంబేడు బస్ టెర్మినల్ నుంచే ప్రభుత్వ, ప్రైవేటు బస్సులు నడపాలని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు అన్నామలై డిమాండ్ చేశారు. రాజధాని నగరానికి పొరుగు జిల్లాల నుంచి నిత్యం వేలాదిమంది వస్తుంటారన్నారు. వారి సౌకర్యార్థం వేల కోట్లు వెచ్చించి కోయంబేడులో అత్యాధునిక బస్‌స్టేషన్, దుకాణాలు, వాణిజ్య సముదాయాలు ఏర్పాటయ్యాయని అన్నారు. కానీ, హఠాత్తుగా నిర్మాణాలు పూర్తికాకుండానే కీలంబాక్కం బస్ టెర్మినల్‌ను ప్రారంభించిన డీఎంకే ప్రభుత్వం... దక్షిణాది జిల్లాలకు అక్కడి నుంచే బస్సులు వెళతాయని నిర్బంధం చేస్తోందన్నారు. ఆ బస్టాండ్ నుంచి నగరంలోని పలు ప్రాంతాలకు ఎంటీసీ బస్సులు నడుపుతున్నట్లు రవాణా శాఖ మంత్రి పేర్కొంటున్నారని, కానీ రాత్రి 10 నుంచి ఉదయం 7 గంటల వరకు కీలంబాక్కం నుంచి ఎంటీసీ బస్సులు లేక ప్రయాణికులు రాత్రి వేళ తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఇక ప్రైవేటు వాహనాల్లో నగరంలోకి వచ్చేందుకు అధికంగా ఖర్చు చేయాల్సి వస్తుందన్నారు. కీలంబాక్కం బస్టాండ్‌లో తగిన వసతులు, సబర్బన్ రైల్వేస్టేషన్ పూర్తి అయిన అనంతరం ఇక్కడి నుంచి బస్సులు నడపాలని, అప్పటివరకు కోయంబేడు నుంచే ప్రభుత్వ, ప్రైవేటు బస్సులు నడపాలని అన్నామలై డిమాండ్ చేశారు.

వైద్యుల సమస్యల పరిష్కారానికి కమిటీ

పెరంబూర్, ఫిబ్రవరి 2: వేతన పెంపు సహా వైద్యులు తెలుపుతున్న పలు డిమాండ్లను పరిశీలించేందుకు ముగ్గురితో కమిటీని నియమిస్తూ వైద్య, ప్రజా సంక్షేమ శాఖ కార్యదర్శి ఉత్తర్వులు జారీ చేశారు. వైద్యులు తెలుపుతున్న సమస్యలను పరిశీలించి, వాటిని అధ్యయనం చేసి నివేదిక దాఖలు చేయాలని కమిటీకి ఉత్తర్వులు జారీ అయ్యాయి. ప్రజా ఆరోగ్యం, వ్యాధి నిరోధక శాఖ డైరెక్టర్, వైద్య విద్య, పరిశోధన డైరెక్టర్ తదితరులు ఈ కమిటీలో చోటు చేసుకున్నారు.

బ్రెయిన్ డెడ్ మృతుడికి మంత్రి నివాళి

అడయార్, ఫిబ్రవరి 2: స్థానిక రాయపురంలోని స్టాన్లీ ప్రభుత్వ ఆస్పత్రిలో బ్రెయిన్‌డెడ్ అయిన మృతుడి భౌతికకాయానికి రాష్ట్ర మంత్రి ఎం.సుబ్రమణ్యం అంజలి ఘటించారు. వాషర్‌మెన్‌పేటకు చెందిన ధనశేఖర్ (57) సెక్యూరిటీగా పనిచేస్తూ, కొన్ని రోజుల క్రితం ఇంట్లో జారిపడడంతో తలకు బలమైన గాయమైంది. అప్పటి నుంచి ఆస్పత్రిలో చికిత్స పొందుతూ వచ్చిన ఆయన బ్రెయిన్ డెడ్ అయినట్టు వైద్యులు ప్రకటించారు. అదే సమయంలో ఆయన అవయవాలను దానం చేసేందుకు కుటుంబీకులు ముందుకు వచ్చారు. దీంతో అవయవాలను సేకరించి ప్రభుత్వ నిబంధనల మేరకు అవయవదానం కోసం పేర్లను నమోదు చేసుకున్న వారికి వాటిని శస్త్రచికిత్సల ద్వారా అమర్చారు.

ఉత్తమ చిత్రాల్లో ఒకటిగా 'లవర్'

● శక్తివేలన్

ఈ యేడాది విడుదలయ్యే చిత్రాల్లో ఉత్తమ చిత్రంగా 'లవర్' నిలుస్తుందని ప్రముఖ నిర్మాత, శక్తి ఫిలిమ్స్ అధినేత శక్తి వేలన్ నమ్మకం వ్యక్తం చేశారు. మిలియన్ డాలర్స్ స్టూడియోస్, ఎంఆర్‌పీ ఎంటర్‌టైన్మెంట్లు సంయుక్తంగా నిర్మించిన సినిమా 'లవర్'. 'గుడ్‌నైట్' ఫేం మణికంఠన్, శ్రీగౌరి ప్రియ, కన్నా రవి, శరవణన్, గీతా కైలాసం, హరీష్ కుమార్, నిఖిలా శంకర్, రిని, అరుణాచలేశ్వరన్ తదితరులు నటించారు. ప్రభురామ్ వ్యాస్ కథను సమకూర్చి దర్శకత్వం వహించారు. షాన్‌రోల్డన్ సంగీత బాణీలు సమకూర్చిన ఈ చిత్రాన్ని మహేష్ రాజ్ పసిలియన్, నజరత్ పసిలియన్, యువరాజ్ గణేశన్ సంయుక్తంగా నిర్మించారు. శక్తి ఫిలిం ఫ్యాక్టరీ విడుదల చేయనుంది. ఈ చిత్రం ఆడియో రిలీజ్ వేడుక శుక్రవారం చెన్నైలో జరిగింది. ఇందులో శక్తి వేలన్ మాట్లాడుతూ, 'అన్ని వయసుల వారి జీవితాకు బాగా కనెక్ట్ అవుతుంది. ఈ యేడాది విడదలయ్యే చిత్రాల్లో ఉత్తమ చిత్రంగా నిలుస్తుంది' అన్నారు. నిర్మాత మహేష్‌రాజ్ మాట్లాడుతూ... 'ఈ సినిమా చాలా బాగా వచ్చింది. ప్రతి ఒక్కరూ అద్భుతంగా నటించారు. మణికంఠన్ నటన చూసి ఆశ్చర్యపోయా. సూపర్‌స్టార్ రజనీకాంత్ సినిమా 'లాల్‌సలామ్' రిలీజ్ రోజునే మా సినిమా కూడా విడుదల కావడం సంతోషంగా ఉంది' అన్నారు. హీరోయిన్ శ్రీగౌరి ప్రియ మాట్లాడుతూ... 'ఈ సినిమాలో నటించేందుకు అంగీకరించిన తర్వాత నేను తమిళం నేర్చుకున్నా' అని అన్నారు. దర్శకుడు ప్రభురాం వ్యాస్ మాట్లాడుతూ... 'మణికంఠన్, యువరాజ్ గణేశన్ వల్లే ఈ సినిమా సాధ్యమైంది. సినిమాకు మంచి పాటలను అందించిన షాన్‌రోల్డన్‌కు హృదయపూర్వక ధన్యవాదాలు. మరో మంచి ఆడియో ఆల్బం అవుతుంది' అన్నారు. హీరో మణికంఠన్ మాట్లాడుతూ... '2019లోనే ఈ చిత్ర కథను దర్శకుడు నాకు వినిపించారు. అయితే, ఈ పాత్రకు నన్ను ఎంపిక చేయకపోయినా పర్వాలేదు.. కచ్చితంగా ఈ స్క్రిప్టును సినిమా తీయాలని దర్శకుడికి చెప్పాను. కానీ, ఆయన నాతోనే చేస్తానని పట్టుబట్టి పూర్తి చేశారు. నా కెరీర్‌లో మరో మంచి సినిమా అవుతుంది' అని అన్నారు. షాన్ రోల్డన్ మాట్లాడుతూ... 'మణికంఠన్‌తో కలిసి మరోసారి కలిసి పనిచేయడం సంతోషం. ఓ మంచి ఎంటర్‌టైన్ మూవీని చూసేందుకు సిద్ధంగా ఉండండి' అని అన్నారు. అలాగే, పలువురు చిత్ర యూనిట్ సభ్యులు ప్రసంగించారు.


'లవర్' చిత్ర బృందం

విడుదలకు సిద్ధమైన 'ఈ మెయిల్'

ఎస్ఆర్ ఫిలిమ్స్ ఫ్యాక్టరీ బ్యానరుపై ఎస్ఆర్ రాజన్ స్వయంగా నిర్మించి దర్శకత్వం వహించిన 'ఈమెయిల్' సినిమా ఈ నెల 9న విడుదలకు సిద్ధమైంది. కన్నడ నటి రాగిణి ద్వివేది ప్రధాన పాత్రను పోషించగా, హీరోగా 'మరుగా' ఫేం అశోక్‌కుమార్ నటించారు. రెండో హీరోహీరోయిన్లుగా ఆదవ్ బాలాజీ, భోజ్‌పురి నటి ఆర్తీశ్రీ నటించారు. మనోబాలా, లొల్లు సభ మనోహర్, వనితాశ్రీ, అక్షయ్ రాజ్, ఆరెంజ్ మిఠాయ్ ప్రభ తదితరులు నటించారు. ఇటీవల పెరిగిపోయిన ఆన్‌లైన్ మోసాలు, వాటివల్ల కలిగే నష్టాలను వివరిస్తూ ఈ సినిమాను రూపొందించారు. తమిళం, కన్నడ భాషల్లో తెరకెక్కించిన ఈ చిత్రం తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాల్లో దాదాపు 250కి పైగా థియేటర్లలో ఈ నెల 9వ తేదీన భారీ ఎత్తున విడుదల చేసేందుకు సన్నాహాలు చేస్తున్నారు.


'ఈ మెయిల్'లో ఓ దృశ్యం

చిత్రజ్యోతి

ఈ యేడాది ఆరు చిత్రాలు నిర్మిస్తాం

● నిర్మాత ఐసరి కె.గణేష్

ఈ యేడాది తమ సొంత బ్యానర్ వేల్స్ ఫిలిమ్ ఇంటర్నేషనల్ పతాకంపై ఆరు చిత్రాలను నిర్మించనున్నట్టు ప్రముఖ నిర్మాత డాక్టర్ ఐసరి కె.గణేశ్ తెలిపారు. ఆ బ్యానరుపై ఆర్‌జే బాలాజీ హీరోగా వచ్చిన చిత్రం 'సింగపూర్ సెలూన్'. గోకుల్ దర్శకుడు. గత నెలలో విడుదలై హిట్ సాధించింది. దీంతో చిత్రం చెన్నైలో సక్సెస్ మీట్ వేడుకలు నిర్వహించింది. ఇందులో నిర్మాత ఐసరి కె.గణేశ్ మాట్లాడుతూ... 'గత నెల 25న విడుదలై అత్యధిక కలెక్షన్లు రాబట్టిన చిత్రాల్లో సింగపూర్ సెలూన్ నిలిచింది. ఈ బ్యానరుకు కొత్త యేడాది తొలివిజయం. ఈ సినిమాను రాష్ట్రవ్యాప్తంగా విడుదల చేసిన రెడ్ జెయింట్ మూవీస్‌కు ధన్యవాదాలు. 'ఎల్‌కేజీ' నుంచి 'మూక్కుత్తి అమ్మన్' చిత్రాల తర్వాత ఆర్‌జే బాలాజీ మా బ్యానరులో నటించిన మూడో చిత్రం. ఈ స్టోరీలో ఆర్జే బాలాజీ ఎలా నటిస్తారని అనేక మంది ప్రశ్నించారు. ఆ ప్రశ్నలన్నింటికీ ఆయన తన నటనతోనే సమాధానం చెప్పారు. సత్యరాజ్, రోబో శంకర్, చిన్న జయంత్ ఇలా ఇందులో నటించిన ప్రతి ఒక్కరూ తమతమ పాత్రలను అద్భుతంగా పోషించారు. బ్యానరులో గోకుల్ మరో చిత్రం చేయనున్నారు. అందులో నటించే నటీనటుల వివరాలను త్వరలోనే వెల్లడిస్తాం. ఈ యేడాది ఆరు చిత్రాలు నిర్మించేందుకు ప్లాన్ చేశాం. ఈ నెలలో గౌతం వాసుదేవ్ మీనన్ దర్శకత్వం వహించే 'జోష్వా', మార్చిలో మరికొన్ని చిత్రాల షూటింగులు ప్రారంభించనున్నామనే విషయాన్ని సంతోషంగా వెల్లడిస్తున్నాం' అని ప్రకటించారు. హీరో ఆర్జే బాలాజీ మాట్లాడుతూ... 'ఈ సినిమా అనేక మందికి బలమైన నమ్మకం కలిగించేలా నిలిచింది. నిర్మాత ఐసరి గణేశ్ నాకు తండ్రి లాంటివారు. ఆయన వద్ద నా అభిప్రాయాలను వెల్లడించే స్వాతంత్ర్యం ఉంది' అని పేర్కొన్నారు. అలాగే, చిత్ర దర్శకుడు గోకుల్, ఎడిటర్ ఆర్.కే.సెల్వ, నటులు చిన్ని జయంత్, ఇమాన్ అన్నాచ్చి తదితరులు ప్రసంగించారు.



'సింగపూర్ సలూన్' సక్సెస్ మీట్

కార్తీ సరసన శ్రీదివ్య!

'కాష్మోరా' చిత్రంలో నటించిన శ్రీదివ్య... సుదీర్ఘకాలం తర్వాత తమిళ చిత్రంలో నటించనున్నారు. ఇందులో హీరోగా కార్తీ నటించనున్నారు. శివకార్తికేయన్ నటించిన 'వరుత్తపడాద వాలిబర్ సంఘం' మూవీ ద్వారా తమిళ వెండితెరకు పరిచయమైన ఆమె... ఆ తర్వాత హీరో జీవా సరసన 'వెల్లక్కారదురై', 'ఖాకిచట్టై', 'మరుదు', 'కాష్మోరా' వంటి అనేక సినిమాల్లో నటించారు. దర్శకుడు అట్లీ సొంతంగా నిర్మించిన చిత్రంలో హీరో జీవా సరసన నటించారు. ఆ తర్వాత ఆమెకు పెద్దగా సినిమా అవకాశాలు రాలేదు. ఈ నేపథ్యంలో గత యేడాది విక్రమ్‌ప్రభుతో 'రైడ్' చిత్రంలో నటించారు. ఇపుడు కార్తీ హీరోగా ప్రేమ్‌కుమార్ దర్శకత్వంలో తెరకెక్కనున్న చిత్రంలో ఆమె హీరోయిన్‌గా నటించనున్నారు.



కేంద్రప్రభుత్వానిది నిజాయితీతో కూడిన బడ్జెట్

● ఐటీ ప్రిన్సిపల్ చీఫ్ కమిషనర్ సునీల్‌మాథూర్

ప్యారీస్, ఫిబ్రవరి 2: కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ పార్లమెంటులో ప్రవేశపెట్టిన మధ్యంతర బడ్జెట్ ఆదాయపు పన్ను రేట్లు మారలేదని ఇన్‌కం టాక్స్ ప్రిన్సిపల్ చీఫ్ కమిషనర్ ఆఫ్ తమిళనాడు సునీల్ మాథూర్ పేర్కొన్నారు. స్థానిక నందనం వెస్ట్ సీఐటీ నగర్‌లో ఉన్న డాక్టర్ వీఎల్ దత్ హాలులో శుక్రవారం సాయంత్రం 4 గంటలకు ఆంధ్ర ఛాంబర్ ఆఫ్ కామర్స్ (ఏసీసీ), ఫిక్కీ సంయుక్త ఆధ్వర్యంలో కేంద్ర బడ్జెట్‌పై ప్రత్యేక సదస్సు నిర్వహించారు. ముఖ్యఅతిథిగా సునీల్ మాథూర్ పాల్గొని గురువారం లోక్‌సభలో ప్రవేశపెట్టిన మధ్యంతర బడ్జెట్‌లో ఉన్న అంశాలను వివరిస్తూ మాట్లాడారు. ఈ బడ్జెట్‌లో మౌలికమైన మార్పులు ఎక్కువగా లేవని, లోక్‌సభ ఎన్నికల తర్వాతే సంపూర్ణ బడ్జెట్ ప్రవేశపెడతారన్నారు. అనంతరం గౌరవ అతిథి, ప్రిన్సిపల్ కమిషనర్ ఆఫ్ సెంట్రల్ జీఎస్‌టీ, సెంట్రల్ ఎక్సైజ్ (చెన్నై) డాక్టర్ జేఎం కెనడీ మాట్లాడుతూ... మధ్యంతర బడ్జెట్‌లో రాబోయే ఐదేళ్లలో ప్రభుత్వ విధివిధానాలు, పురోభివృద్ధి గురించి ఉందన్నారు. ఈ సదస్సులో ఏసీసీ వైస్ ప్రెసిడెంట్ ఎస్.నర్సింహన్, ట్రెజరర్ వీవీ సంపత్‌కుమార్, పబ్లిక్ రిలేషన్ కమిటీ చైర్మన్ కేఎన్ సురేష్‌బాబు, ఫిక్కీ కన్వీనర్ అమృత్‌లాల్, పేర్ల బద్రీనారాయణ తదితరులు పాల్గొన్నారు.



సదస్సులో ప్రసంగిస్తున్న సునీల్ మాథూర్

ప్రధాని మోదీ తిరుప్పూరు సభకు భారీ ఏర్పాట్లు

చెన్నై, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు అన్నామలై వందరోజుల పాదయాత్ర ముగింపు వేడుక సభ జరగనున్న తిరుప్పూరులో పార్టీ నిర్వాహకులు, పోలీసు ఉన్నతాధికారులు పటిష్ట ఏర్పాట్లు చేపడుతున్నారు. ఈ సభలో ప్రధాని నరేంద్రమోదీ పాల్గొననున్నారు. ఈ బహిరంగ సభ ఈనెల 25న జరిగే అవకాశం ఉందని, ఈ విషయంపై ప్రధాని కార్యాలయం త్వరలోనే ప్రకటన జారీ చేయనుందని బీజేపీ రాష్ట్ర నాయకులు తెలిపారు. తిరుప్పూరు జిల్లా పల్లడం మాదపూరు ముత్తుకుమారసామి పర్వతాలయం ఎదురుగా ఉన్న 400 ఎకరాల స్థలాన్ని బహిరంగ సభ కోసం ఎంపిక చేసిన ప్రాంతంలో ఎక్స్‌కవేటర్ల సాయంతో చదును చేస్తున్నారు. తిరుప్పూరు జిల్లా ఎస్పీ అభిషేక్ గుప్తా ఇతర అధికారులు సభా స్థలాన్ని పరిశీలించి ఏ రీతిలో ప్రధానికి భద్రత కల్పించాలనే విషయమై పార్టీ నిర్వాహకులతో చర్చించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ... రెండుమూడ్రోజుల్లో ప్రధాని భద్రతా దళం ఈ ప్రాంతాన్ని పరిశీలించేందుకు వస్తుందని తెలిపారు.


ప్రధాని బహిరంగ సభ జరగనున్న ప్రాంతంలో నేలను ఎక్స్‌కవేటర్‌తో చదును చేస్తున్న కార్మికులు


సభావేదిక వద్ద చేపట్టాల్సిన భద్రతా ఏర్పాట్లను పరిశీలిస్తున్న తిరుప్పూరు డీఎస్పీ అభిషేక్ గుప్తా

శాస్త్రోక్తంగా అవినాశి లింగేశ్వరాలయ మహాకుంభాభిషేకం


కొత్తరూపు సంతరించుకున్న రాజగోపురం, కుంభాభిషేక వేడుకల్లో పాల్గొన్న భక్తులు

చెన్నై, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): తిరుప్పూరు జిల్లా అవినాశిలోని కరుణాంబిక సమేత అవినాశి లింగేశ్వరాలయ మహాకుంభాభిషేకం శుక్రవారం ఉదయం శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఈ వేడుకల్లో వేలాదిమంది భక్తులు పాల్గొన్నారు. కాశీ క్షేత్రానికి దీటైన శైవక్షేత్రంగా అవినాశి లింగేశ్వరాలయం ప్రఖ్యాతి గడించింది. 2010లో ఈ ఆలయ కుంభాభిషేకం జరిగింది. 14 యేళ్ల తర్వాత కుంభాభిషేకం జరిపేందుకు ఆలయ అధికారులు చర్యలు చేపట్టారు. గత యేడాది జీర్ణోద్ధరణ పనులు ప్రారంభించారు. నెల రోజులకు ముందు మరమ్మతులన్నీ ముగియడంతో కుంభాభిషేకం పనులకు శ్రీకారం చుట్టారు. ఆ మేరకు జనవరి 23న వినాయక పూజ, గణపతి హోమంతో, 29 యాగశాల పూజలు వరుసగా ప్రారంభమయ్యాయి. ఈనెల 1న గురువారం ఉయదం 6గంటలకు ఆరో కాల యాగం నిర్వహించారు. ఉదయం 10 గంటలకు వివిధ దేవతా మూర్తులకు పవిత్ర జలాలలో సంప్రోక్షణ జరిపారు. సాయంత్రం 6 గంటలకు ఏడో కాల యాగం, అష్టోత్తర శత సుగంధ ద్రవ్యాలతో ప్రత్యేక యాగం నిర్వహించారు. శుక్రవారం ఉదయం ఎనిమిదో కాల యాగ పూజలు ముగిసిన తర్వాత పవిత్ర కలశాలను ప్రధాన అర్చకులు, శైవాగమ పండితులు ఆలయ రాజగోపురం పైకి ఊరేగింపుగా తీసుకెళ్లారు. ఉదయం 9.15 గంటల నుంచి 10.15 గంటల్లోగా అవినాశియప్పర్, పెరుంకరుణాంబికై అమ్మవారు, సుబ్రమణ్యపెరుమాళ్ సన్నిధుల గోపురాలపై పవిత్ర నదీ జలాలను చల్లారు. ఆ తర్వాత రాజగోపుర కలశాలను వివిధ నదుల నుంచి తెప్పించిన పవిత్ర జలాలతో సంప్రోక్షించారు. ఆ తర్వాత ఆలయ గోపురం దిగువనున్న వేలాదిమంది భక్తులపై అర్చకులు సంప్రోక్షణ జలాలను చల్లారు. ఈ కుంభాభిషేకాలు సిరవై ఆధీనం కుమార గురుపర స్వామి, పేరూరాధీనం శాంతలింగ మరుదాచలం అడిగళార్, కూనంపట్టి ఆధీనం రాజశరవణ మాణిక్కవాసగ స్వామి ఆధ్వర్యంలో శాస్త్రోక్తంగా నిర్వహించారు.



ప్రదర్శనను ప్రారంభిస్తున్న ప్రముఖులు

'ప్రాజెక్ట్ డే'కి విశేష స్పందన

చెన్నై, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): స్థానిక రామాపురం ప్రాంగణంలో వున్న ఎస్ఆర్ఎం యూనివర్శిటీ ప్రాంగణంలో జరిగిన 'ప్రాజెక్ట్ డే'కు విశేష స్పందన లభించింది. యువ ఇంజనీర్లు, డెంటిస్టులలో దాగి వున్న ప్రతిభను వెలికితీయడమే లక్ష్యంగా కార్యక్రమం జరిగింది. డీఆర్‌డీవో ఇండస్ట్రీ అకాడమీ డైరెక్టర్ డాక్టర్ ఓఆర్ నందగోపాలన్, ఎస్ఆర్ఎం గ్రూపు ఇనిస్టిట్యూషన్ల చైర్మన్ డాక్టర్ ఆర్.శివకుమార్‌తో కలిసి ఈ ప్రాజెక్టు ప్రదర్శనను ప్రారంభించారు. 350 కంటే ఎక్కువగా వినూత్న, విశేషమైన ప్రాజెక్టులు ఏర్పాటు చేసిన ఈ ప్రదర్శనలో 5 వేలమందికి పైగా సందర్శకులు పాల్గొన్నారు. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, రోబోటిక్స్ మరియు ఆటోమేషన్, బయో మెడికల్ ఇంజనీరింగ్ వంటి అభివృద్ధి చెందుతున్న రంగాల్లో హైఎండ్ టెక్నాలజీతో ప్రదర్శించబడిన అనేక నమూనాలు విద్యార్థులను ఆకర్షించాయి.

ఏఐఎన్‌యూలో అరుదైన చికిత్స


విలేకరుల సమావేశంలో వైద్యులు

చెన్నై, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): మెడికల్ టెక్నాలజీలో పురోగతికి నిదర్శనంగా 76 ఏళ్ల రిటైర్డ్ సీనియర్ పోలీసు అధికారి ఇటీవల చెన్నైలోని 'ఆసియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ నెఫ్రాలజీ అండ్ యూరాలజీ'లో యూరోలిఫ్ట్ చికిత్స పొందారు. ఈ వివరాలను ఆసుపత్రి చీఫ్ కన్సల్టెంట్ యూరాలజిస్ట్, మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ అరుణ్‌కుమార్ నేతృత్వంలోని వైద్య బృందం శుక్రవారం విలేఖరుల సమావేశంలో వెల్లడించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... ప్రొస్టేట్ వ్యాధుల కోసం అధునాతన యూరోలిఫ్ట్ చికిత్సతో ఆరోగ్య అడ్డంకులను అధిగమించారని వివరించారు.

రామకృష్ణకు తెలుగు ప్రముఖుల నివాళి

చెన్నై, ఫిబ్రవరి 2 (ఆంధ్రజ్యోతి): గత కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతూ గురువారం రాత్రి కన్నుమూసిన అమరజీవి పొట్టి శ్రీరాములు స్మారక సమితి వ్యవస్థాపకుడు వై.రామకృష్ణకు నగరంలోని పలువురు తెలుగు ప్రముఖులు నివాళి అర్పించారు. ఆయన మృతి పట్ల తీవ్ర సంతాపం వెలువరిస్తూ ప్రకటనలు విడుదల చేశారు.


యర్రమిల్లి రామకృష్ణ (ఫైల్‌ఫొటో)

ఆత్మీయతా మూర్తి రామకృష్ణ
డాక్టర్ కాసల నాగభూషణం

అమరజీవి పొట్టి శ్రీరాములు ఆత్మ త్యాగ ఫలం ఆంధ్ర రాష్ట్రం. ఆయన ఆత్మ బలిదానం చేసిన పరమ పవిత్ర క్షేత్రం మైలాపూరులో ఉన్న 'అమరజీవి స్మారక మందిరం'. అలుపెరుగని పోరాటంతో ఆ మందిర నిర్మాణాన్ని సాకారం చేసిన అపర భగీరథుడు వైఎస్ శాస్త్రి. ఆయన చివరి కోరిక మేరకు అమరజీవి స్మారక సమితి పేరిట ఆ శ్రీరాములు త్యాగాన్ని అనుక్షణం గుర్తు చేస్తున్నవారు, తండ్రి మాట జవదాటని శ్రీరామచంద్రుడు యర్రమిల్లి రామకృష్ణ. నెలవారీ కళాసాహితీ సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించేవారు. కరోనా రోజుల నుంచి నెల నెలా వెన్నెల పేర అదో దీక్షగా జూం మీటింగులను జరిపిస్తున్నారు. మాలతీచందూర్ మానసపుత్రుడిగా వారి రచనలన్నింటినీ సేకరించి సీడీల రూపంలో ప్రచురించి, విశ్వవిద్యాలయాల స్థాయిలో విపుల ప్రచారం చేశారు. వారి ఆకస్మిక మరణం చెన్నపురి సాంస్కృతిక రంగానికి తీరని నష్టం. పొట్టి శ్రీరాములు, వైఎస్ శాస్త్రి, యర్రమిల్లి రామకృష్ణ... చెన్నపురి సాంస్కృతిక ప్రపంచానికి త్రిమూర్తులు, ధన్యజీవులు. సోదర సమానులు రామకృష్ణకు ఇవే నా ఆత్మీయమైన అక్షర నివాళి.

ఆయన మరణం తెలుగువారికి తీరని లోటు
ద్రావిడ దేశం కృష్ణారావు


తెలుగువారందరికీ ఆత్మీయుడు, అమరజీవి పొట్టి శ్రీరాములు స్మారక సమితి వ్యవస్థాపకుడు వై.రామకృష్ణ అనారోగ్యం కారణంగా భౌతికంగా దూరమైనందుకు ఎంతో మనోవేదన చెందుతున్నా. ఆయన ఆధ్వర్యంలో అమరజీవి పొట్టి శ్రీరాములు స్మారక భవనంలో జరిగిన ఎన్నో మంచి కార్యక్రమాలు మరువలేనివి. ఒక మంచి మనిషిని కోల్పోవడం తెలుగు భాషకు, తెలుగువారికి తీరని లోటు. వారి పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని కోరుకుంటున్నా.

తండ్రి ఆశయం కోసం...
కాపు సేవా సమితి ప్రధాన కార్యదర్శి ఆదికేశవులు

తండ్రి ఆశయం కోసం విదేశాల్లో వున్న ఉన్నతోద్యోగాన్ని పరిత్యజించిన త్యాగి రామకృష్ణ. ఆయన శాశ్వత నిష్క్రమణ మొత్తం తెలుగు సమాజానికి లోటు. తన తండ్రి కన్న కలలన్నింటినీ నెరవేర్చారు. ఆయన పలు ఒడిదుడుగులు, అవమానాలు ఎదుర్కొన్నప్పటికీ రెట్టించిన పట్టుదలతో దృఢంగా ముందుకు కదిలారు. ఆయన ఎన్నో దానాలు చేశారు. వారి అసమాన సేవలు, త్యాగాలు అరుదైన మహోన్నత వ్యక్తుల్లో ఒకరిగా నిలబెట్టాయి. బరువెక్కిన హృదయంతో ఇదే నా కన్నీటి నివాళి.

కొలంబో - చెన్నై ఫిట్స్ ఎయిర్ సర్వీస్ వార్షికోత్సవం

అడయార్, ఫిబ్రవరి 2: శ్రీలంకకు చెందిన అతి తక్కువ ధరకే ప్రయాణ సౌకర్యం కల్పిస్తున్న ఫిట్స్‌ఎయిర్ విమానయాన సంస్థ కొలంబో నుంచి చెన్నైకు విమాన సర్వీసును నడుపుతోంది. ఈ సర్వీసు ప్రారంభించి యేడాది విజయవంతంగా పూర్తి చేసుకుంది. దీన్ని పురస్కరించుకుని ట్రావెల్ ఏజెంట్లతో ప్రత్యేక సమావేశాన్ని ఏర్పాటు చేసింది. ఈ సందర్భంగా నగరంలో సేల్స్ కార్యాలయాన్ని ప్రారంభించింది. టిక్కెట్ల విక్రయాలు, ప్రయాణికులకు మెరుగైన సౌకర్యాలు కల్పించేందుకు దోహదపడేలా ఈ కార్యాలయం పని చేయనుంది. ఈ సందర్భంగా ఫిట్స్‌ఎయిర్ డైరెక్టర్ అమర్‌ఖాసీం మాట్లాడుతూ... కొలంబో - చెన్నై విమాన సర్వీసు ఎలాంటి ఆటంకాలు లేకుండా ఒక యేడాది పూర్తి చేసుకోవడం చాలా థ్రిల్‌గాను, సంతోషంగా ఉందన్నారు.


విలేకరుల సమావేశంలో అమర్ ఖాసీం


చెన్నై రాజ్‌భవన్‌లో గవర్నర్ ఆర్ఎన్ రవికి పుష్ప గుచ్ఛం అందజేసి ఈ నెల 12న ప్రారంభం కానున్న శాసనసభ సమావేశానికి ఆహ్వానిస్తున్న స్పీకర్ అప్పావు




ప్రజాపనుల శాఖకు ప్రధాన కార్యాలయం

● ప్రారంభించిన మంత్రి ఉదయనిధి

అడయార్, ఫిబ్రవరి 2: స్థానిక చెపాక్కంలో ప్రజాపనుల శాఖకు కొత్తగా నిర్మించిన దక్షిణ ప్రాంతీయ ప్రధాన కార్యాలయాన్ని రాష్ట్ర మంత్రి ఉదయనిధి శుక్రవారం ప్రారంభించారు. రాష్ట్ర మంత్రి ఏవీ వేలు, ప్రభుత్వ ముఖ్య కార్యదర్శి చంద్రమోహన్, ప్రిన్సిపల్ చీఫ్ ఇంజనీర్ సత్యమూర్తి, చీఫ్ ఇంజనీర్ రాజశేఖరన్ తదితరులు పాల్గొన్నారు. ఈ భవనాన్ని రూ.23.05 కోట్లతో మూడు అంతస్తుల్లో 1,04,049 చదరపు అడుగుల విస్తీర్ణంలో నిర్మించారు. మొదటి అంతస్తులో చీఫ్ ఇంజనీర్ కార్యాలయం, డివిజనల్ ఇంజనీర్, ఇతర ఉన్నతాధికారుల కార్యాలయాలు, రెండో అంతస్తులో ప్రధాన ఆడిటోరియం, కార్యాలయం, గ్రంథాలయం, మూడో అంతస్తులో ప్లానింగ్, ఇతర కార్యాలయాలను ఏర్పాటు చేశారు.

ఫ్రంట్‌లైన్ ఆస్పత్రిలో 'పీడియాట్రిక్ కార్డియాలజీ కాన్ఫరెన్స్'


సదస్సులో పాల్గొన్న కార్డియాలజిస్టులు

అడయార్, ఫిబ్రవరి 2: నగరంలోని ప్రముఖ కార్పొరేట్ ఆస్పత్రుల్లో ఒకటైన ఫ్రాంటియర్ ఫ్రంట్‌లైన్ హాస్పిటల్‌లో ప్రతిష్ఠాత్మక 'పీడియాట్రిక్ కార్డియాలజీ కాన్ఫరెన్స్' జరిగింది. ఇందులో జాన్‌హాప్‌కిన్స్‌కు చెందిన ప్రముఖ పీడియాట్రిక్ కార్డియాలజిస్ట్ షెల్బీ కుట్టి ముఖ్యఅతిథిగా పాల్గొని తన అమూల్యమైన సమాచారాన్ని వెల్లడించారు. చెన్నై నగరవ్యాప్తంగా ఉన్న అనేక మంది కార్డియాలజిస్టులు పాల్గొన్నారు. సీనియర్ పీడియాట్రిక్ కార్డియాలజిస్ట్ కే.ఎస్.మూర్తి సంక్లిష్టమైన ఆపరేషన్లలో తన అపార అనుభవం, విలువైన సమాచారాన్ని, ప్రాక్టికల్ నాలెడ్జ్‌ను వెల్లడించారు. ఫ్రాంటియర్ ఫ్రంట్‌లైన్ ఆస్పత్రి సీనియర్ కార్డియాలజిస్ట్ అజీత్ అరుల్ కుమార్ మాట్లాడుతూ... చెన్నైలో కార్డియాలజీ సంరక్షణను పెంపొందించే లక్ష్యంతోనే ఈ తరహా సదస్సులను నిర్వహిస్తున్నట్టు పేర్కొన్నారు.

దిక్సూచి DIKSUCHI

ఏపీపీఎస్సీ/డీఎస్సీ పరీక్షల ప్రత్యేకం
ఇండియన్ జాగ్రఫీ

సాంప్రదాయేతర శక్తి వనరులు

సాంప్రదాయేతర శక్తి వనరులు ఎల్లప్పుడూ లభ్యమవుతాయి. అందువల్ల వీటిని పునరుద్ధరణ(Renewable) శక్తి వనరులు అంటారు. వీటిని ప్రత్యామ్నాయ శక్తి వనరులు అని కూడా అంటారు. ప్రత్యామ్నాయ శక్తి వనరులకు ఉదాహరణలు..

- జల విద్యుత్ శక్తి(Hydro Electricity)
- సౌర శక్తి(Solar Energy)
- పవన శక్తి(Wind Energy)
- అలల శక్తి(Wave Energy)
- వేలాతరంగా శక్తి(Tidal Energy)
- భూతాప శక్తి(Geothermal Energy)



- బయోమాస్(Biomas)
- OTEC(Ocean Thermal Energy Convertion)

1981లో ప్రత్యామ్నాయ శక్తి వనరులను అభివృద్ధి చేసేందుకు భారత ప్రభుత్వం DNES (Departmen of Conventional Energy Sources) అనే సంస్థను ఏర్పాటు చేసింది.

జల విద్యుత్: 2019 నాటికి మన దేశంలో మొత్తం జల విద్యుత్ ఉత్పత్తి- 45,293 మెగావాట్లు. జలవిద్యుత్ ఉత్పత్తిలో పంజాబ్, కర్ణాటక అగ్ర స్థానాల్లో ఉన్నాయి. జల విద్యుత్ ఉత్పత్తికి 1975లో నేషనల్ హైడ్రో పవర్ కార్పొరేషన్‌ను ఏర్పాటు చేశారు. మధ్యప్రదేశ్‌లోని ఇందిరాసాగర్ దేశంలో అత్యధిక జల విద్యుత్ ఉత్పత్తి సామర్థ్యం కలిగిన ప్రాజెక్టు. దేశంలో మొదటిసారిగా జల విద్యుత్‌ను జనరేటర్ల సహాయంతో 1889లో పశ్చిమ బెంగాల్‌లోని డార్జిలింగ్ ప్రాంతంలో గల 'లోనాపల' వద్ద ఉత్పత్తి చేశారు. మొట్టమొదట జల విద్యుత్ కేంద్రాన్ని 1902లో కర్ణాటకలోని మైసూర్ వద్ద ఉన్న శివన్నసముద్రం వద్ద కావేరీ నదిపై నిర్మించారు. ఈ జల విద్యుత్ కేంద్రం కర్ణాటకలోని కోలార్ బంగారు గనికి విద్యుత్‌ను సరఫరా చేస్తుంది. దేశంలో అత్యంత ఎత్తుగల జలవిద్యుత్ కేంద్రం - నాత్పా జాక్రీ(హిమాచల్ ప్రదేశ్). కేరళ 100 శాతం జల విద్యుత్ పైనే ఆధారపడ్డది. జల విద్యుత్‌ను తెల్ల బొగ్గు అని కూడా అంటారు. ప్రపంచ జల విద్యుత్ ఉత్పత్తిలో మనదేశం ఆరో స్థానంలో, చైనా మొదటి స్థానంలో ఉన్నాయి. ప్రపంచంలో అతిపెద్ద జల విద్యుత్ కేంద్రం త్రీ గార్జెస్. దీని ఉత్పత్తి సామర్థ్యం 22,500 మెగావాట్లు. ప్రపంచంలోనే రెండో అతిపెద్ద జల విద్యుత్ కేంద్రాన్ని బ్రెజిల్‌లోని ఇటైపు వద్ద నిర్మించారు. దీని సామర్థ్యం 14,000 మెగా వాట్లు.

సౌర శక్తి: 2019 నాటికి మొత్తం సౌర విద్యుత్ స్థాపిత సామర్థ్యం 28,180.71 మెగా వాట్లు. సౌర విద్యుత్ స్థాపిత సామర్థ్యం అధికంగా గల రాష్ట్రాలు కర్ణాటక, తెలంగాణ. కొచ్చి(కేరళ) విమానాశ్రయం సౌర విద్యుత్‌తో నడుస్తోంది. 2020 జూన్‌లో ఆసియాలోనే అతిపెద్ద సోలార్ ప్లాంట్‌ను మధ్యప్రదేశ్‌లోని 'రివా'లో ప్రారంభించారు. దీనిని 500 హెక్టార్ల విస్తీర్ణంలో 700 మెగావాట్ల సామర్థ్యంతో నిర్మించారు. ప్రపంచంలో అతిపెద్ద సోలార్ బాయిలర్‌ను 2009లో షిరిడీలో ఏర్పాటు చేశారు. దీనిని ఉపయోగించి ప్రతి రోజూ 50,000 మందికి ఆహారపదార్థాలు వండవచ్చు. తిరుమలలో 15000 మందికి ఆహారపదార్థాలు వండగలిగే సోలార్ బాయిలర్ ఉంది. దిల్‌షుక్‌నగర్(హైదరాబాద్)లోని సాయిబాబా గుడిలో 3000 మందికి ఆహారపదార్థాలు వండగలిగే సోలార్ బాయిలర్ ఉంది. సౌర శక్తి ఉత్పత్తిలో అమెరికా, జర్మనీ, చైనా, జపాన్ వరుస స్థానాల్లో ఉన్నాయి. భారత్ ఎనిమిదో స్థానం లో ఉంది. మొట్టమొదట సౌరశక్తి కేంద్రం జమ్మూ కశ్మీర్‌లోని చొగ్లాంసర్ వద్ద నిర్మించారు. ఆసియాలో నే అతిపెద్ద సౌర తటాకం(Solar Pond) గుజరాత్‌లోని భుజ్ వద్ద ఉంది.

పవన శక్తి: దేశ పవన శక్తి ఉత్పత్తి సామర్థ్యం 35,625 మెగావాట్లు. ప్రపంచంలో పవన శక్తి ఉత్పత్తిలో చైనా మొదటి, భారత్ నాలుగో స్థానాల్లో ఉన్నాయి. దేశంలో పవన శక్తి ఉత్పత్తిలో తమిళనాడు, గుజరాత్, మహారాష్ట్ర వరుస స్థానాల్లో ఉన్నాయి. భారతదేశంలో పవన విద్యుత్‌ను ఎక్కువగా ఉపయోగించుకుంటున్న ప్రాంతం జోగిమట్టి(కర్ణాటక). దేశంలో మొట్టమొదటి పవన శక్తి కేంద్రాన్ని గుజరాత్‌లోని మాండవి వద్ద 1986లో నిర్మించారు. దేశంలో అతిపెద్ద శక్తి కేంద్రం తమిళనాడులోని ముప్పాండల్ వద్ద ఉంది.

అలల శక్తి: మొట్ట మొదటి అలల శక్తి కేంద్రాన్ని కేరళలోని తిరువనంతపురం వద్ద గల విజింజీం వద్ద నిర్మించారు.

వేలాతరంగ శక్తి: ఆసియాలోనే మొట్టమొదటి వేలాతరంగ విద్యుత్ కేంద్రం గుజరాత్‌లోని కాండ్లా వద్ద నిర్మించారు. వేలాతరంగ విద్యుత్ ఉత్పత్తికి అనుకూలమైన ప్రాంతాలు- గల్ఫ్ ఆఫ్ కచ్(1200 మెగావాట్లు), గల్ఫ్ ఆఫ్ కంభట్(7000 మెగావాట్లు), సుందర్ బన్స్.

భూతాప శక్తి: భారతదేశంలో ఏకైక భూతాప శక్తి కేంద్రం హిమాచల్ ప్రదేశ్‌లోని 'మణికరణ్' వద్ద ఉంది. జమ్మూ కశ్మీర్‌లోని లడఖ్‌లో గల పూగా లోయ కూడా భూతాపశక్తి ఉత్పత్తికి అనుకూలమైంది. భారత్‌లో 45,000 మెగా వాట్లు జియో థర్మల్ ఉత్పత్తికి అవకాశం ఉంది.

బయోమాస్: దీనిని వ్యర్థ పదార్థాల నుంచి ఉత్పత్తి చేస్తారు. మొట్ట మొదటి బయోమాస్ విద్యుత్ కేంద్రం పంజాబ్‌లోని జలంధర్ వద్ద నిర్మించారు. బయోమాస్‌లో 60 శాతం మీథేన్, 40 శాతం కార్బన్ డై ఆక్సైడ్ ఉంటాయి.

OTEC(Ocean Thermal Energy Convertion): దీనిని సముద్రపు నీటి ఉష్ణోగ్రతల వ్యత్యాసం ఆధారంగా ఉత్పత్తి చేస్తారు. ప్రపంచంలోనే మొట్టమొదటి OTEC కేంద్రం తమిళనాడులోని ట్యూటికోరిన్ వద్ద అమెరికా సహాయంతో నిర్మించారు. ప్రస్తుతం భారతదేశంలో ఐదు ప్రాంతీయ గ్రిడ్స్ ఉన్నాయి.



వి.వెంకటరెడ్డి,
సీనియర్ ఫ్యాకల్టీ.

నిట్ వరంగల్‌లో ఆన్‌లైన్ ఎఫ్‌డీపీ



వరంగల్‌లోని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ(నిట్ వరంగల్)- ఆన్‌లైన్ ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్ ప్రోగ్రామ్(ఎఫ్‌డీపీ)లలో ప్రవేశానికి దరఖాస్తులు కోరుతోంది. ఈ ప్రోగ్రామ్‌లను కేంద్ర ఎలక్ట్రానిక్స్ అండ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ మంత్రిత్వ శాఖ స్పాన్సర్ చేస్తోంది.

ఒక్కో ప్రోగ్రామ్ వ్యవధి 12 రోజులు. ప్రతి ప్రోగ్రామ్‌లో 100 సీట్లు ఉన్నాయి. ఫస్ట్ కం ఫస్ట్ సర్వ్ పద్ధతిలో అభ్యర్థులకు అవకాశం కల్పిస్తారు. ఐఐటీలు, ఐఐఐటీలు, నిట్ సంస్థల్లో పనిచేస్తున్న ఫ్యాకల్టీ మెంబర్లు సెషన్స్ నిర్వహిస్తారు. ఇంజనీరింగ్/ఎంసీఏ కాలేజీల ఫ్యాకల్టీలు, ఇండస్ట్రీ ప్రొఫెషనల్స్, పీజీ చదువుతున్నవారు, పీహెచ్‌డీ అభ్యర్థులు రిజిస్ట్రేషన్ చేసుకోవచ్చు.

స్మార్ట్ కాంట్రాక్ట్ మాస్టరీ:పయనీరింగ్ ద ఫ్యూచర్ ఆఫ్ బ్లాక్ చెయిన్ అప్లికేషన్స్

సంస్థ ఆధ్వర్యంలోని సీఎస్ఈ డిపార్ట్‌మెంట్, ఈ&ఐసీటీ అకాడమీలు ఈ ప్రోగ్రామ్‌ని నిర్వహిస్తున్నాయి. ఇందులో బ్లాక్ చెయిన్-కరెంట్ అండ్ ఫ్యూచర్ అప్లికేషన్స్, ఇన్ఫర్మేషన్ అటెస్టేషన్ అండ్ మల్టీ ప్రొటోకాల్ స్టోరేజ్ ఫర్ వెబ్, బ్లాక్ చెయిన్-క్వెరీ లాంగ్వేజ్, బిజినెస్ నెట్‌వర్క్స్ అండ్ ప్రాసెస్ బేస్ట్ ఆన్ మోడలింగ్ అండ్ బ్లాక్ చెయిన్ తదితర అంశాలు వివరిస్తారు. టెస్టింగ్ టూల్స్‌కు సంబంధించి ప్రాక్టికల్ సెషన్స్ ఉంటాయి.

- **ప్రోగ్రామ్ వ్యవధి:** మార్చి 25 నుంచి ఏప్రిల్ 5 వరకు
- **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** మార్చి 20

ఆప్టిమైజేషన్ టెక్నిక్ ఫర్ ఇంజనీరింగ్ అప్లికేషన్స్

ఈ ప్రోగ్రామ్‌ని సంస్థ ఆధ్వర్యంలోని ఈ&ఐసీటీ అకాడమీ నిర్వహిస్తోంది. ఇందులో డైరెక్ట్ సెర్చ్ మెథడ్స్, గ్రేడియంట్ బేస్ట్ మెథడ్స్, సింపుల్ మెథడ్ అండ్ లీనియర్ ప్రోగ్రామింగ్, జెనెటిక్ అల్గారిథమ్, పార్టికల్ ఆప్టిమైజేషన్, డిఫరెన్షియల్ ఎవల్యూషన్, కాలనీ ఆప్టిమైజేషన్ అల్గారిథమ్, సిమ్యులేటెడ్ ఎనీలింగ్ అల్గారిథమ్ తదితర అంశాలు వివరిస్తారు. సాఫ్ట్ కంప్యూటింగ్, మెటా ఆప్టిమైజేషన్ అల్గారిథమ్‌లకు సంబంధించిన కేస్ స్టడీస్ ఉంటాయి.

- **ప్రోగ్రామ్ వ్యవధి:** మార్చి 11 నుంచి 22 వరకు
- **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** మార్చి 5
- **దరఖాస్తు ఫీజు:** రూ.1000
- **వెబ్‌సైట్:** nitw.ac.in

నార్మ్‌లో పీజీడీఎం అగ్రిబిజినెస్ మేనేజ్‌మెంట్

హైదరాబాద్-రాజేంద్రనగర్‌లోని ఐకార్ - నేషనల్ అకాడమీ ఆఫ్ అగ్రికల్చరల్ రీసెర్చ్ మేనేజ్‌మెంట్ (నార్మ్)- 'పోస్ట్ గ్రాడ్యుయేట్ డిప్లొమా ఇన్ మేనేజ్‌మెంట్(అగ్రిబిజినెస్ మేనేజ్‌మెంట్)' ప్రోగ్రామ్‌లో ప్రవేశానికి నోటిఫికేషన్ విడుదల చేసింది. ఇది రెండేళ్ల వ్యవధి గల రెసిడెన్షియల్ ప్రోగ్రామ్. ఇందులో ఆరు ట్రైమెస్టర్లు ఉంటాయి. ప్రోగ్రామ్‌లో భాగంగా ఆరు నుంచి ఎనిమిది వారాల సమ్మర్ ఇంటర్న్‌షిప్, 12 వారాల బిజినెస్ బూట్ క్యాంప్, 13 వారాల ప్రాజెక్ట్ వర్క్ ఉంటాయి. ఇందులో మొత్తం 66 సీట్లు ఉన్నాయి. కేంద్ర ప్రభుత్వ నిబంధనల మేరకు రిజర్వేషన్‌లు వర్తిస్తాయి. దీనికి ఏఐసీటీఈ గుర్తింపు ఉంది.

అర్హత: యూజీసీ గుర్తింపు పొందిన కళాశాల నుంచి అగ్రికల్చర్, అగ్రి బిజినెస్ మేనేజ్‌మెంట్, కమర్షియల్ అగ్రికల్చర్, అగ్రికల్చరల్ మార్కెటింగ్ అండ్ కోఆపరేషన్, అగ్రికల్చరల్ ఇంజనీరింగ్, అగ్రికల్చరల్ బయోటెక్నాలజీ, డెయిరీ సైన్స్/టెక్నాలజీ, ఫిషరీస్, ఫుడ్ టెక్నాలజీ/ఫుడ్ ప్రాసెస్ ఇంజనీరింగ్, ఫారెస్ట్రీ, హార్టికల్చర్, సెరికల్చర్, వెటర్నరీ సైన్స్, హోమ్ సైన్స్/కమ్యూనిటీ సైన్స్, అగ్రికల్చరల్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ విభాగాలకు సంబంధించి ఒకదానిలో నాలుగేళ్ల డిగ్రీ ఉత్తీర్ణులై ఉండాలి. పదోతరగతి నుంచి డిగ్రీ స్థాయి వరకు ప్రథమ శ్రేణి మార్కులు ఉండాలి. ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు అయిదు శాతం సడలింపు వర్తిస్తుంది. క్యాట్ 2023/సీమ్యాట్ 2024 స్కోర్ తప్పనిసరి. సంబంధిత రంగంలో కనీసం ఆర్నెల్ల అనుభవం ఉన్నవారికి ప్రాధాన్యం ఉంటుంది.

- **దరఖాస్తు ఫీజు:** జనరల్ అభ్యర్థులకు రూ.2,000; ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు రూ.1000
- **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** ఫిబ్రవరి 29
- **వెబ్‌సైట్:** naarm.org.in/

'దిక్సూచి' వెబ్ పేజీలో..
సమాచారం కోసం ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి.
లేదా ఈ కింది యూఆర్ఎల్ https://ejyothy.com/K1ylmt7లో చదవండి.

ఐఐఎం రోహ్‌తక్‌లో ఐపీఎం

రోహ్‌తక్‌లోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్(ఐఐఎం)- ఇంటిగ్రేటెడ్ ప్రోగ్రామ్ ఇన్ మేనేజ్‌మెంట్ (ఐపీఎం)లో ప్రవేశానికి నోటిఫికేషన్ విడుదల చేసింది. ఇది అయిదేళ్ల వ్యవధిగల రెసిడెన్షియల్ ప్రోగ్రామ్. బిజినెస్ మేనేజ్‌మెంట్ విభాగాల్లో రాణించాలనుకొనే వారికి ఈ ప్రోగ్రామ్ అనువుగా ఉంటుంది. ఐపీఎం ఆప్టిట్యూడ్ టెస్ట్(ఐపీఎం ఏటీ) 2024, పర్సనల్ ఇంటర్వ్యూ, అకడమిక్ ప్రతిభ ఆధారంగా ప్రవేశాలు కల్పిస్తారు. మొత్తం 165 సీట్లు ఉన్నాయి. మొదటి మూడేళ్ల తరవాత ప్రోగ్రామ్ నుంచి వైదొలగే వీలుంది. వీరికి బీబీఏ(బ్యాచిలర్ ఆఫ్ బిజినెస్ అడ్మినిస్ట్రేషన్) డిగ్రీని ప్రదానం చేస్తారు. ప్రోగ్రామ్ మొత్తం పూర్తిచేసిన వారికి ఎంబీఏ డిగ్రీ ఇస్తారు. క్యాంపస్ ప్లేస్‌మెంట్ సౌకర్యం ఉంది.

అర్హత: గుర్తింపు పొందిన బోర్డ్ నుంచి ఏదేని గ్రూప్‌తో ఇంటర్/పన్నెండో తరగతి/తత్సమాన కోర్సు ఉత్తీర్ణులై ఉండాలి. పదోతరగతి, ఇంటర్ స్థాయుల్లో జనరల్ అభ్యర్థులకు ప్రథమ శ్రేణి మార్కులు; దివ్యాంగులు, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు కనీసం 55 శాతం మార్కులు ఉండాలి. ప్రస్తుతం చివరి సంవత్సర పరీక్షలకు సన్నద్ధమౌతున్న వారు కూడా అప్లయ్ చేసుకోవచ్చు. అభ్యర్థుల వయసు 2024 జూన్ 30 నాటికి 20 ఏళ్లు మించకూడదు.

ఐపీఎం ఆప్టిట్యూడ్ టెస్ట్ (ఐపీఎం ఏటీ) 2024 వివరాలు: దీనిని ఆబ్జెక్టివ్ విధానంలో నిర్వహిస్తారు. ఇందులో క్వాంటిటేటివ్ ఎబిలిటీ, లాజికల్ రీజనింగ్, వెర్బల్ ఎబిలిటీ అనే మూడు సెక్షన్‌లు ఉంటాయి. ఒక్కో సెక్షన్‌లో 40 మల్టిపుల్ చాయిస్ ప్రశ్నలు అడుగుతారు. ఒక్కో ప్రశ్నకు నాలుగు మార్కులు కేటాయించారు. సమాధానాన్ని తప్పుగా గుర్తిస్తే ఒక మార్కు కోత విధిస్తారు. సెక్షన్‌కు 40 నిమిషాలు చొప్పున మొత్తం పరీక్ష సమయం రెండు గంటలు.

- **ఆన్‌లైన్ దరఖాస్తు ప్రక్రియ ప్రారంభం:** ఫిబ్రవరి 6 నుంచి
- **దరఖాస్తు ఫీజు:** రూ.4,500
- **దరఖాస్తుకు చివరి తేదీ:** ఏప్రిల్ 10
- **ఐపీఎం ఆప్టిట్యూడ్ టెస్ట్ 2024:** మే 18 నుంచి
- **వెబ్‌సైట్:** iimrohtak.ac.in

నవ్య | చిత్రజ్యోతి

2025

జనవరి 10న విశ్వంభర



మెగాస్టార్ చిరంజీవి నటిస్తున్న తాజా చిత్రం 'విశ్వంభర'. ఈ సినిమా టైటిల్ టీజర్‌తోనే ప్రపంచ వ్యాప్తంగా ఉన్న తన అభిమానుల్ని, ప్రేక్షకుల్ని అలరించారు చిరంజీవి. 'బింబిసార' చిత్ర దర్శకుడు వశిష్ట దర్శకత్వంలో రూపుదిద్దుకుంటున్న ఈ మెగా ఫాంటసీ అడ్వెంచర్ కోసం 13 భారీ సెట్స్‌తో కొత్త ప్రపంచం సృష్టించారు. ఈ సినిమా షూటింగ్‌లో మెగాస్టార్ శుక్రవారం అడుగుపెట్టారు. హైదరాబాద్‌లో వేసిన భారీ సెట్‌లో ప్రస్తుతం షూటింగ్ జరుగుతోంది. యూవీ క్రియేషన్స్ పతాకంపై విక్రమ్, వంశీ, ప్రమోద్ అత్యంత భారీ బడ్జెట్‌తో 'విశ్వంభర' చిత్రాన్ని నిర్మిస్తున్నారు. మెగాస్టార్ చిరంజీవి ఇప్పటివరకూ నటించిన చిత్రాల్లో ఇదే కాస్ట్లీయస్ట్ ఫిల్మ్. వచ్చే సంక్రాంతి సందర్భంగా జనవరి 10న 'విశ్వంభర'ను విడుదల చేస్తామని నిర్మాతలు ప్రకటించారు. ఈ చిత్రానికి సాహిత్యం: శివశక్తి దత్తా, చంద్రబోస్, సంగీతం: కీరవాణి, ఛాయాగ్రహణం: చోటా కె నాయుడు, ఎడిటింగ్: కోటగిరి వెంకటేశ్వరావు, సంతోష్ కామిరెడ్డి.

అర్థం చేసుకొనే లైఫ్ పార్టనర్ ఉన్నాడు



లావణ్య

'వరుణ్‌తేజ్‌తో పెళ్లయిన తర్వాత కెరీర్ పరంగా ఏమీ మార్పు లేదు.. మెగా కుటుంబంలోకి వచ్చాక 'నువ్వు ఇలా చేయాలి.. అలా చేయాలి' అని ఎవరూ నాకు చెప్ప లేదు. కెరీర్ పరంగా నాకు కావాల్సినంత స్వేచ్ఛ ఉంది. వరుణ్ లాంటి అర్థం చేసుకొనే లైఫ్ పార్టనర్ ఉన్నాడు. మా వరకూ గతంలో లాగానే ఉన్నాం. ఒక పెద్ద ఫ్యామిలీలోకి అడుగుపెట్టడం మంచి అనుభూతినిచ్చింది. వరుణ్, నేను ఎవరి ప్రొఫెషనల్ వర్క్‌లో వాళ్లం ముందుకు వెళ్తాం. నేను చేసే ప్రాజెక్ట్‌లో వరుణ్ ఇన్‌వాల్వ్ కాడు. 'మిస్ పర్ఫెక్ట్ స్క్రిప్ట్ చదివి బాగుందన్నాడు' అని చెప్పారు లావణ్య. తను హీరోయిన్‌గా నటించిన వెబ్ సిరీస్ 'మిస్ పర్ఫెక్ట్' డిస్నీ హాట్ స్టార్‌లో స్ట్రీమింగ్ అవుతున్న సందర్భంగా ఆమె మీడియాతో ముచ్చటించారు.

- 'ఈ సిరీస్‌లో మంచి నటులు ఉన్నారు. రొమాంటిక్, కామెడీ ఎలిమెంట్స్ బ్లెండ్ చేసిన మంచి స్క్రిప్ట్ ఇది. ఇలాంటి స్క్రిప్ట్ నా దగ్గరకు రావడం హ్యాపీగా ఉంది. ఇందులో నేను 'మిస్ లావణ్య , లక్ష్మి' అనే పాత్రలు చేశాను. అన్ని రకాల ఎమోషన్స్ ఈ పాత్రల్లో ఉన్నాయి. నా పర్సనల్ లైఫ్‌కు దగ్గరగా ఉండే పాత్రలివి. సినిమాలకు, వెబ్ సిరీస్‌కు పెద్ద తేడా కనిపించలేదు. సినిమా షూటింగ్ జరిగినట్టే ఈ వెబ్ సిరీస్ వర్క్ కూడా జరిగింది' అని చెప్పారు లావణ్య.
- 'కొత్త దర్శకులతో పని చేయడం ఎప్పుడూ రిఫ్రెషింగ్‌గా ఉంటుంది. మా దర్శకుడు విశ్వక్ ఖండేరావు రైటింగ్ యూనిక్‌గా ఉంటుంది. అతనితో వర్క్ చేయడం ఆనందంగా ఉంది. సెట్‌లో ఎవరు సలహా చెప్పినా స్వీకరించేవారు. పర్ఫెక్షనిస్ట్‌గా ఉండడం వల్ల ఎన్ని సమస్యలు వస్తాయో ఈ సిరీస్‌లో చూస్తారు' అని ఆమె అన్నారు. నిర్మాత సుప్రియ తనకు మంచి స్నేహితురాలు కావడంతో ఈ సిరీస్ కంఫర్ట్‌గా చేశానని చెప్పారు. పీపుల్ మీడియా ఫ్యాక్టరీ ఓ కొత్త హీరోతో నిర్మించే చిత్రంలో నటించనున్నట్లు లావణ్య చెప్పారు. ఇందులో తనది పోలీస్ ఆఫీసర్ పాత్ర అన్నారు. దీంతో పాటు ఒక తమిళ సినిమా కూడా చేస్తున్నట్లు వెల్లడించారు.

వేసవిలో వస్తున్న ఫ్యామిలీ స్టార్



విజయ్ దేవరకొండ నటిస్తున్న 'ఫ్యామిలీ స్టార్' చిత్రం విడుదల తేదీని చిత్ర యూనిట్ శుక్రవారం ప్రకటించింది. ఏప్రిల్ 5న ఈ సినిమాను గ్రాండ్‌గా రిలీజ్ చేస్తున్నట్లు వెల్లడించారు. పరశురామ్ పెట్ల దర్శకత్వంలో దిల్ రాజు, శిరీష్ నిర్మిస్తున్నారు. మృణాల్ ఠాకూర్ హీరోయిన్‌గా నటిస్తున్న ఈ చిత్రానికి క్రియేటివ్ ప్రొడ్యూసర్‌గా వాసు వర్మ ఉన్నారు. రిలీజ్ డేట్ ప్రకటించిన సందర్భంగా స్పెషల్ పోస్టర్ విడుదల చేశారు. ఈ పోస్టర్‌లో విజయ్ మిడిల్ క్లాస్ ఫ్యామిలీ మ్యాన్‌లా కనిపిస్తున్నారు. లుంగీ కట్టుకుని భుజాన గోనె సంచీ, ఆధార్ కార్డ్‌తో విజయ్ నడిచి వస్తున్న పోస్టర్ ఆకట్టుకుంటోంది. ఫ్యామిలీ యాక్షన్ ఎంటర్‌టైనర్‌గా రూపుదిద్దుకుంటున్న ఈ చిత్రం ప్రేక్షకులను అలరిస్తుందని దర్శకనిర్మాతలు చెప్పారు.

'చిత్రజ్యోతి'లో మరిన్ని ఆసక్తికర కథనాల కోసం ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి. లేదా ఈ కింది యూఆర్ఎల్ https://ejyothy.com/lb27nMSలో చదవండి.



22న గోవాలో రకుల్ పెళ్లి



హీరోయిన్ రకుల్ ప్రీత్‌సింగ్ పెళ్లి ముహూర్తం ఖరారు అయింది. తన ప్రియుడు, నిర్మాత, నటుడు జాకీ భగ్నానితో ఆమె వివాహం ఈ నెల 22న గోవాలో జరుగనుంది మిడిల్ ఈస్ట్‌లో ధూమ్ ధామ్‌గా డెస్టినేషన్ వెడ్డింగ్ చేసుకోవాలని మొదట రకుల్, ఆమె బాయ్ ఫ్రెండ్ అనుకున్నారు. అయితే ప్రధాని నరేంద్ర మోదీ డెస్టినేషన్ వెడ్డింగ్స్ విదేశాల్లో కాకుండా మన దేశంలోనే నిర్వహించాలని ఇటీవల .విజ్ఞప్తి చేయడంతో రకుల్, జాకీ తమ ఆలోచన మార్చుకుని గోవాలో పెళ్లి చేసుకోవాలని నిర్ణయించుకున్నారు. పెళ్లి తర్వాత ముంబైలో రిసెప్షన్ గ్రాండ్‌గా ఏర్పాటు చేసి టాలీవుడ్, బాలీవుడ్‌లోని చిత్ర ప్రముఖులందరినీ ఆహ్వానించాలని కూడా వారు అనుకున్నారు. అయితే తాజాగా అందుతున్న సమాచారం ప్రకారం ముంబైలో కానీ మరెక్కడ కానీ వీళ్ల పెళ్లి రిసెప్షన్ జరగడం లేదు.

గ్రామీణ ప్రేమకథ



వినాయక్ దేశాయ్, అపర్ణా దేవి జంటగా నటించిన ప్రేమకథా చిత్రం 'రాధా మాధవం'. దాసరి ఇస్సాకు దర్శకత్వం వహించిన ఈ చిత్రాన్ని గోనాల్ వెంకటేశ్ నిర్మించారు. షూటింగ్ పూర్తి చేసుకున్న ఈ చిత్రం ట్రైలర్‌ను హీరో శ్రీకాంత్ విడుదల చేశారు. ట్రైలర్ బాగుందనీ, సినిమా విజయం సాధించాలనీ ఆయన కోరారు. నిర్మాత మాట్లాడుతూ 'గ్రామీణ నేపథ్యంలో రూపుదిద్దుకొన్న ప్రేమకథ ఇది. ఈ నెలలోనే చిత్రాన్ని విడుదల చేస్తాం' అని చెప్పారు. సెన్సార్ కార్యక్రమాలు జరుగుతున్నాయనీ, తను అనుకున్న విధంగా సినిమా తీయడానికి నిర్మాత ఎంతో సహకరించారనీ దర్శకుడు తెలిపారు. దీప్తి, మేకా రామకృష్ణ, జయప్రకాశ్, ప్రియ, నవీన్, రవి శివతేజ, సుమన్, రాచర్ల లాస్య తదితరులు నటించిన ఈ చిత్రానికి కథ, మాటలు, పాటలు: వసంత్ వెంకట్ బాలా, సంగీతం: చైతు కొల్లి, ఛాయాగ్రహణం: తాజ్ జీడీకే.

యువతను మెప్పించే రేవ్ పార్టీ

క్రిష్ సిద్దిపల్లి

'నేను లేని నా ప్రేమకథ' చిత్రంతో హీరోగా వెండితెరకు పరిచయమయ్యారు క్రిష్ సిద్దిపల్లి. ఆయన కథానాయకుడిగా రూపొందిన 'రేవ్‌పార్టీ' చిత్రం విడుదలకు సిద్ధమైంది. ఈ సందర్భంగా క్రిష్ సినిమా విశేషాలను మీడియాతో పంచుకున్నారు.

- హీరో అవ్వాలనేది నా కోరిక. కెరీర్ ఆరంభంలో పలు తెలుగు చిత్రాలకు సహాయ దర్శకుడిగా, ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్‌గా పనిచేశాను. ఆ తర్వాత నటుడిగా చిన్నపాత్రలు పోషించాను. ప్రస్తుతం హీరోగా మంచి అవకాశాలు వస్తున్నాయి. నేను హీరోగా నటించిన 'రేవ్‌పార్టీ' చిత్రం విడుదలకు సిద్ధమైంది. యువతను ఆకట్టుకునే వినూత్నమైన కథతో ఈ చిత్రం తెరకెక్కింది. రాజు బొనగాని దర్శకత్వంలో పాన్ ఇండియా స్థాయిలో ఈ చిత్రాన్ని తెరకెక్కించారు. రితిక చక్రవర్తి, ఐశ్వర్యగౌడ హీరోయిన్లు. సింగిల్ షెడ్యూల్‌లో చిత్రీకరణ పూర్తి చేశాం. ఉడుపి, గోవా, బెంగళూరు ప్రాంతాల్లో ఎక్కువగా రేవ్ పార్టీలు జరుగుతుంటాయి. అందుకే ఆ ప్రాంతంలోని ఒరిజినల్ లోకేషన్స్‌లో చిత్రీకరణ చేశాం. రేవ్‌పార్టీలు ఎలా జరుగుతాయి?, వాటి వెనుక ఎవరు ఉంటారు, యువతకు ఎలాంటి నష్టం జరుగుతుందనేది ఆసక్తికరంగా తెరకెక్కించాం. త్వరలోనే విడుదల తేదీ ప్రకటిస్తాం.

